PRABHATA SURYA
ప్రభాత సూర్య
తెలుగు దిన పత్రిక
www.suryaa.news
వేల రూ.5/ - పేజీలు : 8 ఆదివారం 5 అక్టోబర్ 2025 సంపుటి: 01, సంచిక : 79
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

### తగ్గినట్లే తగ్గి మళ్లీ చురకలు అంటిస్తున్న బంగారం ధరలు

ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా మహిళలు బంగారు అభరణాలు ధరిస్తారు. ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాల్లోని మహిళలందరూ బంగారానికి ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తారు. అనేక రకాల డిజైన్లతో లక్షల్లో విలువ చేసే కమ్మలు, నెక్లెస్లు, బ్యాంగిల్స్ వంటివి కొనుగోలు చేస్తుంటారు. ఆడవాళ్లకు ప్రతిరోజూ షాపింగ్ చేసిన బోర్ కొట్టదనడంలో ఎటువంటి సందేహం లేదని చెప్పవచ్చు. కాగా గోల్డ్ రేట్లు ఎప్పుడెప్పుడు తగ్గుతాయా? అంటూ మహిళలు వేయి కళ్లతో ఎదురుచూస్తుంటారు. కాస్త పసిడి ధరలు తగ్గుముఖం పట్టగానే బంగారం షాపుల్లో ఎగబడుతారు. అయితే ఇటీవల బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు జరుగుతోన్న విషయం తెలిసిందే.

విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news


# పరిమితి వేలల్లో.. ఖర్చు లక్షల్లో



- స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల వ్యయ పరిమితి చిత్రాలు
- సర్పంచ్‌గా పోటీచేయాలన్నా ఆస్తులమ్ముకోవాల్సిన పరిస్థితి
- ఎన్నికల సంఘం పరిమితి మాత్రం రూ.2.5 లక్షల లోపే
- సెల్ఫ్ డిక్లరేషన్‌పై అభ్యర్థులు జాగ్రత్తగా ఉండకపోతే అంతే..

హైదరాబాద్

జమీన్ ఆస్మాన్ ఫరక్.. అంటే భూమికి ఆకాశానికి ఉన్నంత తేడా అనేది నానుడి. గత కొన్నేళ్లలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఎన్నికల వ్యయం ఊహించలేనంతగా పెరిగిపోయింది. స్థానిక సంస్థల ఎన్నికల పరిస్థితి కూడా అలాగే తయారవుతోంది. స్థాని క ఎన్నికల్లో పోటీ చేయటం అభ్యర్థులకు తలకు మించిన భారంగా మారుతోంది. వార్డు సభ్యుడు మొదలు సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు పోటీ చేయాలంటే భూము లు ఇతర ఆస్తులు కూడా అమ్ముకోవాల్సి వస్తోంది. ఎన్నికల సంఘం అభ్యర్థులకు విధిస్తున్న వ్యయ పరిమితికి, వాస్తవంగా చేస్తున్న ఖర్చుకు జమీన్ ఆస్మాన్ ఫరక్ ఉంటోంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం గ్రామ వార్డు సభ్యుడు మొదలు జెడ్పీటీసీ వరకు పోటీచేసే అభ్యర్థుల గరిష్ట ఎన్నికల ఖర్చు వివరాలు చూద్దాం.. 5 వేల కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామపంచాయతీలో వార్డు సభ్యుడిగా పోటీ చేసే అభ్యర్థి రూ.30 వేల వరకే ఖర్చు చేయాలి. 5 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామ - మిగతా2లో




నాటి ఆర్జేడీ ఆటవిక పాలనవల్లే

## నేటికీ బీహారీల వలసలు

- గత రెండేళ్లలో బిహార్‌లో 50 లక్షల మందికి ఉపాధి
- ప్రధాని నరేంద్ర మోదీ
- ఆర్జేడీ హయాంలో విద్యావ్యవస్థ నిరాధరణకు గురైంది
- పిల్లలకు సరైన విద్యావశాలు దొరకలేదు
- అభివృద్ధి లేకపోవడంతో పేదరికంలో ఉన్న పేరెంట్స్ పిల్లలను బదులకు బదులుగా పనులకు పంపారు
- దేశంలోనే బిహార్‌లో అత్యధిక యువ జనాభా ఉంది
- బిహార్ యువత సామర్థ్యం పెరిగినప్పుడు సహజంగానే దేశ బలం కూడా పెరుగుతుంది

3

## దేశ పౌరుల రక్షణ కోసం భారత్ ఏ హద్దులనైనా మీరుతుంది



- దేశ పౌరుల భద్రతకు, దేశ సమగ్రతకు ముప్పు పొంచి ఉంటే ఎలాంటి నిర్ణయాత్మక చర్యలకు దిగుతామో ఇప్పటికే నిరూపించాం
- పాకిస్థాన్ భూభాగంలో భారత్ సర్జికల్ స్ట్రైక్స్ చేసినప్పుడు తాము మతం చూడలేదు
- కానీ పహల్గాంలో పౌరులను మతం అడిగి చంపారు
- భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

## నోటిఫికేషన్‌కు గడువు సమీపిస్తోంది

- 'టీపోల్'లో రిజర్వేషన్లు నమోదు చేయాలి
- బ్యాలెట్‌పత్రాల ముద్రణకు టెండర్లను ఖరారు చేయండి
- ఎంపీడీవోలు వార్డుల, ఆర్డీవోలు సర్పంచుల, జడ్పీ సీఈవోలు ఎంపీటీసీ, జడ్పీటీసీ రిజర్వేషన్లను పొందుపర్చాలి.
- ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల నామినేషన్ కేంద్రాలను పరిశీలించి అవసరమైన సిబ్బందిని, సామగ్రిని సిద్ధం చేయాలి
- కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు




హైదరాబాద్

రాష్ట్రంలో గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ నోటిఫికేషన్‌కు గడువు సమీపిస్తున్నందున సర్వం సన్నద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని జిల్లాల కలెక్టర్లను శనివారం ఆదేశించింది. రిజర్వేషన్ల వివరాలను తమ వెబ్‌సైట్ 'టీపోల్'లో నమోదు చేయడంతోపాటు ఆయా పరిశీలనలు చేపట్టాలని సూచించింది. ఇప్పటికే రాష్ట్రంలో వార్డులు, గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల వారీగా ఓటర్ల జాబితాలను 'టీపోల్' వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. ఇటీవల రిజర్వేషన్లను పంచాయతీ రాజ్‌శాఖ సిద్ధం చేసి వాటిపై గెజిట్‌లను జారీ చేసింది. ఈ సమాచారాన్ని సైతం వెబ్‌సైట్‌లో - మిగతా2లో



## నక్సల్స్‌తో చర్చల్లేవ్.. లొంగిపోండి

- కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హెచ్చరిక
- మావోయిస్టులతో చర్చల ప్రసక్తే లేదు
- మావోయిస్టులను మార్చి 31, 2026 నాటికి నిర్మూలిస్తాం
- ఆయుధాలు వదిలేసి లొంగిపోయేందుకు ముందుకు వస్తే స్వాగతిస్తాం
- నక్సల్స్ ఆయుధాలు వీడి లొంగిపోవాలి

3

## తెరపైకి రోజుకో కొత్త పేరు!



- జూబ్లీహిల్స్ అభ్యర్థిత్వం కోసం కాంగ్రెసలో పెరుగుతున్న ఆశావహులు
- బహుమతులు, దావత్‌లతో ప్రజలను ఆకట్టుకునే యత్నం.. పార్టీకి తలనొప్పిగా మారిన వైనం

బంజారాహిల్స్

సామూహిక సీమంతాలు... సామాజిక సేవా కార్యక్రమాలకు ఒకరు శ్రీకారం చుడితే.. మరొకరు బహుమతులతో మహిళలను ఆకట్టుకునే పనిలో ఉన్నారు. బస్తీ నిద్ర పేరిట ఓ నేత హడావుడి చేస్తుంటే.. సీఎం రేవంత్ టీమ్ పేరిట మరో నేత హంగామా సృష్టిస్తున్నారు. - మిగతా2లో



ఆస్పత్రులపై రాజకీయాలు

## దారుణం

- పురోగతి లేని 'టిమ్స్' భవనాల నిర్మాణం.. 1400 కోట్ల బకాయిలతో ఆరోగ్యశ్రీ నిర్వీర్యం
- సిబ్బందికి జీతాల్లేక బస్తీ దవాఖానాల మూత
- కేసీఆర్‌ది ముందుచూపు.. కాంగ్రెసది మందబుద్ధి
- సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు విమర్శలు

## బోనస్ బకాయి రూ.1,159.64 కోట్లు

- గత యాసంగి సన్నవడ్ల బోనస్ ఇప్పటికీ రైతన్నకు అందని వైనం
- మళ్లీ మార్కెట్‌లోకి వస్తున్న వానాకాలం వడ్లు
- సన్నరకం 40 నుంచి 45 ఎల్ఎంటీ ఉంటాయని అంచనా
- వాటికి చెల్లించే బోనస్ రూ. 2,000 కోట్ల నుంచి రూ. 2,200 కోట్లు
- బోనస్ కోసం ఆందోళన బాట పడుతున్న అన్నదాతలు



హైదరాబాద్

రాష్ట్రంలో సన్నధాన్యం పండించిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ చెల్లిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ఒక్క సీజన్‌కే పరిమితమైంది. గత (2024%-% 25) వానాకాలం సీజన్‌లో 24 లక్షల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం పండించిన సుమారు నాలుగున్నర లక్షల మంది రైతులకు రూ.1,200 కోట్ల వరకు చెల్లించింది. యాసంగి సీజన్‌కు సంబంధించిన బోనస్ ఇప్పటి వరకు రూపాయి కూడా చెల్లించలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలోని కృష్ణా ప్రాంత రైతులు ఏకంగా పోరుబాట పట్టారు. బోనస్ చెల్లించకపోవడం తో స్థానిక సంస్థల ఎన్నికల్లో రైతులంతా మూకుమ్మడిగా పోటీ చేసి నిరసన తెలియజేయాలని నిర్ణయించారు. నిజామాబాద్, - మిగతా2లో

# బోనస్ బకాయి రూ.1,159.64 కోట్లు

-మొదటిపేజీ తరువాయి

నల్లగొండ తదితర జిల్లాల్లో సైతం రైతులు యాసంగి బోనస్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ ఏడాది వానకాలం సీజన్ కోతల ప్రక్రియ ప్రారంభమైనా గత యాసంగి బోనస్‌ను విడుదల చేయకపోవడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సన్నధాన్యం పండించే రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నాం. ఈ వానాకాలం సీజన్‌లో 80 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని భావిస్తున్నాం. అందులో 40 నుంచి 45 ఎల్ఎంటీ సన్నరకాలే. వీరందరికీ బోనస్ ఇస్తాం.

**రైతులకు రావలసిన బోనస్ రూ.1,159.64 కోట్లు**

యాసంగి సీజన్‌లో 74.22 ఎల్ఎంటీ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇందులో దొడ్డురకం ధాన్యం 51.03 ఎల్ఎంటీ కాగా, సన్న ధాన్యం 23.19 ఎల్ఎంటీ. ఈ మొత్తం ధాన్యానికి రూ.17,198.58 కోట్ల మొత్తాన్ని ప్రభుత్వం రైతులకు చెల్లించింది. సన్నధాన్యం పండించిన 4,09,031 రైతులకు 1,159.64 కోట్ల మొత్తాన్ని చెల్లించాల్సి ఉంది. ధాన్యం కొనుగోళ్లు పూర్తయి మూడు నెలలు దాటినా బోనస్ విడుదల చేయలేదు. బోనస్ కోసం పోరుబాట పట్టిన మక్తల్ రైతులను మంత్రి వాకిటి శ్రీహరి సముదాయించే ప్రయత్నం చేశారే తప్ప బోనస్‌పై హామీ ఇవ్వలేదు. ఇటీవల పదవీ విరమణ చేసిన పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ సైతం బోనస్ అంశాన్ని ప్రభుత్వం ప్రకటిస్తుందని వారం క్రితం మీడియా సమావేశంలో తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్‌ను దృష్టిలో ఉంచుకొని పెద్ద ఎత్తున రైతులు యాసంగిలో కూడా సన్నాలు సాగు చేశారు. నిజామాబాద్ జిల్లాలో 8 లక్షల ఎల్ఎంటీ ధాన్యాన్ని సేకరిస్తే, అందులో 7.15 లక్షల ఎల్ఎంటీ సన్నాలే ఉన్నాయి. నల్లగొండ, నారాయణపేట, జగిత్యాల, నిర్మల్, సిద్దిపేట, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో కూడా పెద్ద ఎత్తున సన్న ధాన్యాన్ని పండించారు.

ప్రస్తుత వానకాలం సీజన్‌లో సాగు చేసిన 67.33 లక్షల ఎకరాల్లో 60 శాతానికి పైగా సన్నధాన్యమే పండించినట్లు లెక్కలు చెపుతున్నాయి. ఈసారి కొనుగోలు కేంద్రాలకు 80 ఎల్ఎంటీ ధాన్యం వస్తుందని పౌరసరఫరాల శాఖ అంచనా వేసింది. ఇందులో 40 నుంచి 45 ఎల్ఎంటీ సన్నధాన్యం మార్కెట్‌కు వస్తుందని భావిస్తున్నారు. ఈ మొత్తానికి బోనస్ క్వింటాల్‌కు రూ.500 చొప్పున చెల్లిస్తే రూ.2,200 కోట్లు అవుతుంది. ఇప్పటికే ఉన్న బాకాయి 1,159.64 కోట్లు కలిపితే దాదాపు రూ.3,400 కోట్ల వరకు బోనస్ చెల్లించాల్సి ఉంటుంది.

# హైడ్రా కూల్చివేతలతో
# కొండాపూర్‌లో ఉద్రిక్తత

హైకోర్టు తీర్పుతోపాటు రెవెన్యూ శాఖ అధికారుల విజ్ఞప్తి మేరకు కొండాపూర్‌లోని 59వ సర్వే నంబర్‌లోని 36 ఎకరాల సర్కారు భూమిలో గల ఆక్రమణలను శనివారం హైడ్రా తొలగించింది. నోటీసులివ్వకుండా కూల్చివేయడంతో తాము రోడ్డున పడతామని బాధితులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. ఆ ప్రాంతంలోకి ఎవరినీ అనుమతించకుండా భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణలను తొలగించిన హైడ్రా అధికారులు, సిబ్బంది.. ఆ భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించారు. 24 ఏళ్లుగా వివాదంలో ఉన్న భూమి విలువ రూ.3,600 కోట్లు ఉంటుందని రెవెన్యూ అధికారులు అంచనా వేశారు. ఇది ప్రభుత్వ భూమి అని రెవెన్యూశాఖ వాదిస్తే.. 12 మంది వ్యక్తులు తాము ఒక్కొక్కరూ ప్రభుత్వ వేలంలో 3 ఎకరాలు కొనుగోలు చేసి.. 30 ఏళ్లుగా వ్యవసాయం సాగు చేస్తున్నట్లు 1997లో రంగారెడ్డి జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని విచారించిన జిల్లా న్యాయస్థానం.. ఆ భూమి కబ్జాలో ఉన్న వారిదేనని 2002లో ఇచ్చిన తీర్పును.. రెవెన్యూశాఖ 2003లో హైకోర్టులో సవాల్ చేసింది. దీనిపై సమగ్రంగా విచారించిన హైకోర్టు.. అది సర్కారు భూమి అని గత నెల 3వ తేదీన తీర్పునిచ్చిందని శేరిలింగంపల్లి తహశీల్దార్ వెంకారెడ్డి పేర్కొన్నారు. హైకోర్టు తీర్పు, రెవెన్యూ శాఖ విజ్ఞప్తి మేరకు శనివారం ఉదయం 5 గంటల ప్రాంతంలో భారీ పోలీసు బందోబస్తు మధ్య హైడ్రా అధికారుల బృందాలు.. అనుమతి లేని నిర్మాణాలు, షెడ్లు, బోర్లు తొలగించడంతో తమ కుటుంబాలు రోడ్డున పడతాయని బాధితులు వాపోయారు. తాము పైసా పైసా కూడబెట్టిన డబ్బుతో నిర్మించుకున్నామని,



ఉన్నపళంగా వచ్చి ఎలా కూల్చేస్తారని అధికారులతో వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. హైకోర్టు ఆదేశాలతోపాటు ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని, రెవెన్యూశాఖ విజ్ఞప్తి మేరకు తమ సంస్థ పని చేసిందని హైడ్రా వెల్లడించింది.

**30 లక్షల సామగ్రి పాడైంది**

'మేం నాలుగు షాపులతో నిర్మించిన షెడ్డును నెల క్రితమే అద్దెకు తీసుకున్నాం. రూ.30 లక్షలు అప్పు చేసి, వంట సామాన్లు, ఇతర సామగ్రి తెచ్చుకుని టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాం. తెల్లవారు జామునే వచ్చిన హైడ్రా అధికారులు.. మా సామాన్లు తీసుకునే అవకాశమూ ఇవ్వకుండా టిఫిన్ సెంటర్ షెడ్లను కూల్చేశారు. ఇంజనీరింగ్ చదివినా ఉద్యోగం లేక అప్పులు చేసి ఏర్పాటు చేసుకున్న టిఫిన్ సెంటర్‌ను కూల్చేశారు. సామాన్లు తీసుకునే అవకాశం కూడా ఇవ్వలేదు.

## స్థానికంపై 'ప్లాన్ బీ'!

హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ విషయంలో న్యాయపరమైన చిక్కులు ఎదురైతే.. అందుకు అనుగుణంగా వ్యూహాన్ని మార్చుకుని 'ప్లాన్ బీ'ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైనట్టు సమాచారం. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన, మొత్తంగా 50 శాతం పరిమితికి మించి రిజర్వేషన్ల అమలుపై న్యాయస్థానాల్లో ప్రతికూల తీర్పులు వస్తే.. ఏం చేయాలనే దానిపై పంచాయతీరాజ్ శాఖ ప్రణాళికను సిద్ధం చేసినట్టు తెలిసింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లు ఈ నెల 6న సుప్రీంకోర్టులో, 8వ తేదీన రాష్ట్ర హైకోర్టులో విచారణకు రానున్నాయి.

**కోర్టుల వైపు అందరి చూపు..**

పంచాయతీరాజ్ చట్ట సవరణ, బీసీలకు రిజర్వేషన్ల పెంపునకు సంబంధించిన బిల్లులు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉండగా.. ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ జీవోను కొట్టేయాలని గత నెల 27న ఓ వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి విదితమే. ఆ పిటిషన్‌పై ఈ నెల 8న హైకోర్టు విచారణ జరపనుంది. నాటి విచారణలో బిల్లు ఇంకా గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉండగా జీవో ఎలా జారీ చేస్తారని ప్రభుత్వాన్ని కోర్టు ప్రశ్నించింది. ఈ దశలో రిజర్వేషన్ల పెంపుదలను ఆమోదించలేమని, అదేవిధంగా ఎలాంటి నిలిపివేత ఆదేశాలు జారీ చేయలేమని తెలిపింది. ఒకవేళ స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ జారీచేసినా.. పిటిషన్లు ముందే దాఖలు చేసినందున మెరిట్ ఆధారంగా విచారణ చేస్తామని తెలిపింది. తాము ఇచ్చే తీర్పు మేరకే స్థానిక ఎన్నికలు జరుగుతాయని తేల్చి చెప్పింది. దీంతో 8న కోర్టు ఏం తేలుస్తుందన్నదానిపై ఆసక్తి నెలకొంది.

**పాత రిజర్వేషన్ల ప్రకారమూ సిద్ధమే...**

సుప్రీం, హైకోర్టుల్లో వ్యతిరేక తీర్పులు వస్తే పాత రిజర్వేషన్ల పద్ధతిలోనే (50 శాతానికి లోబడి) ఎన్నికలు నిర్వహించేందుకు కూడా పీఆర్ శాఖ సన్నాహాలు చేసుకుంటున్నట్టు చెబుతున్నారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా ఎస్టీ, ఎస్సీల రిజర్వేషన్లను ఖరారు చేసినందున, వాటిని అలాగే ఉంచి గతంలో మాదిరిగా బీసీలకు 23 శాతం రిజర్వేషన్ల కల్పనకు మొగ్గుచూపే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. అసెంబ్లీ ఓటర్ల జాబితాల ఆధారంగా గ్రామపంచాయతీల్లోని వార్డులవారీగా ఫొటోలతో కూడిన ఓటర్ జాబితాలు ఇప్పటికే సిద్ధమయ్యాయి.

కోర్టుల తీర్పు మేరకు ప్రభుత్వం మళ్లీ బీసీ కోటాపై తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా బీసీ, అన్ రిజర్వ్‌డ్ రిజర్వేషన్లను ఖరారు చేసి, వారంలోనే మరోసారి ఎన్నికల షెడ్యూల్ జారీ చేసే అవకాశం ఉందని అంటున్నారు. ఇప్పటికే ఎస్ఈసీ జారీచేసిన ఎన్నికల షెడ్యూల్స్ మార్చి వారం రోజుల అంతరంతో నిర్వహించేలా మరోసారి షెడ్యూల్‌ను జారీచేసే అవకాశాలున్నాయనే చర్చ జరుగుతోంది.

## పరిమితి వేలల్లో.. ఖర్చు లక్షల్లో

-మొదటిపేజీ తరువాయి

పంచాయతీలో వార్డు సభ్యుడిగా పోటీ చేసే అభ్యర్థి గరిష్టంగా రూ.50 వేల వరకే ఖర్చు చేయాలి.5 వేల కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామపంచాయతీలో సర్పంచ్‌గా పోటీ చేసే అభ్యర్థి గరిష్టంగా రూ.1.5 లక్షల వరకే ఖర్చు చేయాలి.

5 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామపంచాయతీలో సర్పంచ్‌గా పోటీ చేసే అభ్యర్థి గరిష్టంగా రూ.2.5 లక్షల వరకే ఖర్చు చేయాలి.

ఎంపీటీసీ అభ్యర్థి గరిష్టంగా రూ.1.5 లక్షల వరకే ఖర్చు చేయాలి.

జెడ్పీటీసీ అభ్యర్థి గరిష్టంగా రూ.4 లక్షల వరకే ఖర్చు చేయాలి.

**అభ్యర్థులు చేయాల్సినవి...**

ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు, సర్పంచ్, వార్డు సభ్యుడిగా పోటీచేసే వారు ఇద్దరు సాక్షులతో కూడిన తమ స్వీయ ప్రకటన (సెల్ఫ్ డిక్లరేషన్)ను నామినేషన్ పత్రంతో రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి.

అభ్యర్థులపై ఒకవేళ క్రిమినల్ కేసులు ఉంటే స్వీకరించిన కేసులు (కాగ్నిజెన్స్ టేకన్) మాత్రమే రాయాలి.

శిక్ష పడిన కేసు వివరాలు రాయాలి.

అభ్యర్థి లేదా భాగస్వామి, అభ్యర్థిపై ఆధారపడిన వారి చర, స్థిరాస్తులు (విదేశీ ఆస్తులతో సహా) పొందుపరచాలి.

ఉమ్మడి ఆస్తిలోని వాటాను కూడా తెలపాలి.

ఉమ్మడిగా కలిగి ఉన్న భూములు, భవనాలు, ఆపార్ట్‌మెంట్ వివరాలు వేర్వేరుగా పొందుపరచాలి.

వ్యవసాయ భూమికి సంబంధిత భూమి సర్వే నంబర్, ఊరు, మండలం, జిల్లా, రాష్ట్రం, మొత్తం విస్తీర్ణం పొందుపరచాలి. వారసత్వమా కాదా అనేది కూడా తెలపాలి.

బాండ్లు,షేర్లు, డిబెంచర్ల విలువ, తత్సంబంధిత కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీ జాబితాలో ఉంటే ప్రస్తుత మార్కెట్ విలువ, జాబితాలో లేని కంపెనీల వివరాలు పుస్తకాలలో పేర్కొన్న ప్రకారం చూపాలి.

ఆధారపడటం అంటే ఓ వ్యక్తి పూర్తిగా అభ్యర్థి ఆదాయంపైనే ఆధారపడినట్టు అర్థం.

ప్రతి పెట్టుబడి, ఎంత మొత్తంలో ఆ పెట్టుబడి పెట్టారో వివరాలు తెలపాలి.

చేతిలో నగదు, అభ్యర్థికి సంబంధించిన నగదు, భార్య/భర్తకు సంబంధించిన నగదు, ఆధారపడిన వారి వద్ద ఉన్న నగదు వివరాలు తెలియజేయాలి.

అభ్యర్థి, భార్య/భర్త, వారిపై ఆధారపడిన వారి బ్యాంకు ఖాతాలు, వాటిలో ఉన్న మొత్తం నిల్వ, బ్యాంకు పేరు, బ్రాంచి పేరు, అకౌంట్ నంబర్లు, ఏదైనా ఫిక్స్‌డ్ డిపాజిట్లు, టర్మ్ డిపాజిట్లు ఉంటే వాటి వివరాలు తెలపాలి.

అభ్యర్థి, భార్య/భర్త, వారిపై ఆధారపడిన వారికి ఉన్న బంగారం, వెండి ఆభరణాలు, వజ్రాలు, ఇతర ఆభరణాలు వాటి బరువు ఒక్కొక్కటిగా పేర్కొనాలి.

అభ్యర్థి, భార్య/భర్తకు సంబంధించిన వృత్తి, వ్యాపార వివరాలు పొందుపరచాలి.

అభ్యర్థికి సంబంధించిన విద్యార్హతల సర్టిఫికెట్లు, కోర్సు పూర్తి చేసిన సంవత్సరం, ఇతర వివరాలు ఇవ్వాలి.

అభ్యర్థుల స్వీయ ప్రకటనను ఇద్దరు సాక్షులతో సంతకాలు చేయించి, వారి పూర్తిపేరు, చిరునామా స్పష్టంగా రాయకపోతే నామినేషన్ తిరస్కరణకు గురవుతుంది.

## తెరపైకి రోజుకో కొత్త పేరు!

-మొదటిపేజీ తరువాయి

ఇక, దసరా నేపథ్యంలో దావత్‌లు, ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు సరేసరి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం పోటీ పడుతున్న నేతలు ఎవరికి వారు తమ బలాన్ని చాటుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఓ వైపు క్షేత్రస్థాయిలో ప్రజలను కలుస్తూ.. అగ్రనేతలకూ టచ్‌లో ఉంటున్నారు. తొలుత ఇద్దరు, ముగ్గురి పేర్లు తెరపైకి రాగా.. క్రమేణా ఆ సంఖ్య పది వరకు చేరడం ఆసక్తికరంగా మారింది.

**గెలిచే సత్తా ఉందని...**

ఉప ఎన్నిక అంశం తెరమీదకు వచ్చినప్పుడు కాంగ్రెసలో అజారుద్దీన్, నవీన్‌యాదవ్ మధ్యే పోటీ ఉంది. అనూహ్యంగా అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంతో నవీన్‌కు మార్గం సుగమమైందని అందరూ భావించారు. ఆయన సైతం సామూహిక సీమంతాల పేరిట ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నాలు ఆరంభించారు. ఇంతలో మాజీ ఎంపీ అంజన్‌కుమార్ పేరిట నియోజకవర్గంలో భారీ ఫ్లెక్సీలు వెలిశాయి. మరోవైపు.. సికింద్రాబాద్ ఎంపీ టికెట్ ఆశించి భంగపడ్డ జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ సైతం అభ్యర్థిత్వం కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. గణనీయ సంఖ్యలో ఓట్లు ఉన్న రెండు కులాల అండ తనకు ఉందని, అవకాశం ఇస్తే తప్పకుండా గెలుస్తానని పార్టీ నేతల వద్ద చెబుతున్నారు. అలాగే, మాజీ మంత్రి కంజర్ల లక్ష్మీనారాయణ యాదవ్ కోడలు కంజర్ల విజయలక్ష్మి, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి పేర్లూ వినిపిస్తున్నాయి. మాజీ కార్పొరేటర్ మురళీగౌడ్ బస్తీ నిద్ర పేరిట ప్రజల వద్దకు వెళ్తుండగా, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెసలో చేరిన రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి కూడా అభ్యర్థిత్వం ఆశిస్తున్నారు. దసరా నేపథ్యంలో టీమ్ రేవంత్‌రెడ్డి పేరిట మైనంపల్లి హన్మంతరావు అనుచరులు నియోజకవర్గంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది. మైనంపల్లికి టికెట్ పక్కా అంటూ ఆయన అనుచరులు ఊదరగొడుతున్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సైతం బీసీ కోటాలో బరిలో దిగేందుకు ప్రయత్నిస్తున్నారు. అనర్హత వేటు పడే అవకాశం ఉన్న దృష్ట్యా.. ఉప ఎన్నికలో అవకాశం కల్పిస్తే గెలిచి తీరుతానని చెబుతున్నారు.

**హైదరాబాద్‌పై పట్టు సాధించాలని..**

గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రమంతా హస్తం హవా కనిపించినా.. గ్రేటర్ హైదరాబాద్‌లో మాత్రం ఎదురుగాలి వీచింది. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ఆ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. ఇక్కడ విజయం సాధిస్తే.. హైదరాబాద్‌లో పార్టీకి పట్టు పెరుగుతుందన్న సంకేతాలు ఇవ్వడంతోపాటు జీహెచ్ఎంసీ ఎన్నికలకూ కలిసి వస్తుందని భావిస్తోంది. అదే సమయంలో బీఆర్ఎసకు చెక్ పెట్టినట్టవుతుందని అంచనా వేస్తోంది. ఈ క్రమంలో గెలుపు గుర్రాన్ని బరిలో దించాలని భావిస్తోంది. అయితే, ఆశావహులు ఎక్కువగా ఉండడం, అభ్యర్థులు ఎవరికి వారు తానే అభ్యర్థినంటూ ప్రచారం చేసుకుంటుండడం పార్టీ నాయకత్వానికి తలనొప్పిగా మారింది. ఆశావహులు పరస్పర విమర్శలు చేసుకోవడం, ఫ్లెక్సీలపై గొడవలు పెట్టుకోవడం, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేసుకుంటుండడం.. పార్టీకి ప్రతికూలంగా మారుతుందన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి.

## నోటిఫికేషన్‌కు గడువు సమీపిస్తోంది

-మొదటిపేజీ తరువాయి

నమోదు చేయాలి. ఎంపీడీవోలు వార్డుల, ఆర్డీవోలు సర్పంచుల, జడ్పీ సీఈవోలు ఎంపీటీసీ, జడ్పీటీసీ రిజర్వేషన్లను పొందుపర్చాలి. ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల నామినేషన్ కేంద్రాలను పరిశీలించి అవసరమైన సిబ్బందిని, సామగ్రిని సిద్ధం చేయాలి. సమస్యాత్మక, అతి సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాలను సందర్శించి అక్కడ వెబ్‌కాస్టింగ్ సౌకర్యాలకు అనువైన ఏర్పాట్లను సిద్ధం చేయాలి. ఇక్కడ అవసరమైన సూక్ష్మ పరిశీలకుల సంఖ్యను సూచించాలి. బ్యాలెట్ పత్రాల ముద్రణకు వెంటనే టెండర్లు పిలవాలి. ఆఫ్‌సెట్ ప్రింటింగ్ ప్రెస్‌ల యజమానులు ఈ నెల 8 మధ్యాహ్నం 2 గంటల్లోగా సీల్డ్ కొటేషన్లను దాఖలు చేసేలా చూడాలి. టెండర్లను అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో జడ్పీ సీఈవోలు, డీపీవోలు, ఇతర అధికారుల సమక్షంలో తెరిచి ఖరారు చేయాలి. ఇందుకు సంబంధించిన పత్రాలు, సమాచారాన్ని వెబ్‌సైట్ ద్వారా వెల్లడించాలని ఎన్నికల సంఘం కలెక్టర్లను ఆదేశించింది.

## ఆస్పత్రులపై రాజకీయాలు దారుణం

హైదరాబాద్/దిల్‌సుఖ్‌నగర్

కరోనా తర్వాత కేసీఆర్ వందేళ్ల ముందుచూపుతో హైదరాబాద్ నాలుగువైపులా నాలుగు టిమ్స్ ఆస్పత్రులను నిర్మించాలని తలపెడితే.. కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పూర్తి చేయడంలో ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కేసీఆర్ మీద ఉన్న కక్షతో ప్రజల ప్రాణాలను కాపాడే ఆస్పత్రులపై పగ పెంచుకోవడం దారుణమని మండిపడ్డారు. శనివారం హరీశ్‌రావు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి కొత్తపేట టిమ్స్ ఆస్పత్రి నిర్మాణాన్ని పరిశీలించారు. ఎల్బీనగర్ టిమ్స్‌లో సెల్లార్‌తో కలిపి 6 అంతస్తుల భవనాన్ని బీఆర్ఎస్ హయాంలో పూర్తిచేస్తే.. రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభు త్వం కేవలం 5 అంతస్తులను మాత్రమే పూర్తిచేసిందని హరీశ్ తెలిపారు. వరంగల్ హెల్త్ సిటీ పనులు కూడా ముందుకు సాగడంలేదన్నారు. కేసీఆర్‌కు పేరు వస్తుందనే దురుద్దేశంతోనే ఆస్పత్రి నిర్మాణ పనులను సీఎం రేవంత్ రెడ్డి ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు ముందుచూపు లేని మందబుద్ధులని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరు చేసిన మహేశ్వరం, కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీలను రద్దు చేయడం దుర్మార్గన్నారు. కేసీఆర్ హయాంలో 450 బస్తీ దవాఖానాలను ప్రారంభించారని, ఆరు నెలలు గా వాటి వైద్యులకు, సిబ్బందికి జీతాలు చెల్లించకుండా రేవంత్ రెడ్డి వాటిని మూతపడేలా చేస్తున్నారన్నారు. రూ.1,400కోట్ల బకాయిలు పెట్టి ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్‌కు పేరొస్తుందనే అక్కసుతో కంటి వెలుగు పథకాన్ని నిలిపివేశారని, రాజకీయాలు పక్కనపెట్టి ఈ పథకాన్ని కొనసాగించాలన్నారు. ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, వివేకానంద గౌడ్, కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ యాదిరెడ్డి, చింత ప్రభాకర్ పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల కోసం కాల్‌సెంటర్

హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన సమాచారం, ప్రజల సందేహాల నివృత్తి, ఫిర్యాదుల స్వీకరణ కోసం కేంద్రీకృత కాల్‌సెంటర్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఏర్పాటు చేసింది. ఇప్పటికే స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ ఎస్ఈసీ జారీ చేసిన నేపథ్యంలో... ప్రజలు సంబంధిత అధికారుల ద్వారా అవసరమైన సమాచారం తెలుసుకు నేందుకు 9240021456తో ఎస్ఈసీ కార్యాల యంలో కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామపంచాయతీ ఎన్నిక లకు సంబంధించి సమాచారాన్ని ప్రజలకు తెలిపేందుకు ఈ కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు ఎస్ఈసీ కార్యదర్శ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

## ఓట్ల చోరీకి వ్యతిరేకంగా..
## గ్రామానికి వంద సంతకాల సేకరణ

హైదరాబాద్

ఎన్నికల్లో నెగ్గడానికి భాజపా ఓట్ల చోరీకి పాల్పడిందని, దానికి వ్యతిరేకంగా రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి వంద మంది నుంచి సంతకాలను సేకరించాలని కాంగ్రెస్ శ్రేణులకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సూచించారు. ఈ కార్యక్రమంపై శనివారం ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌తో కలిసి ఆయన పార్టీ నేతలతో ఆన్‌లైన్‌లో సమావేశమయ్యారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, కార్పొరేషన్ ఛైర్మన్లు, పార్టీ అనుబంధ సంఘాల ఛైర్మన్లు, పీసీసీ కార్యవర్గ సభ్యులు, అధికార ప్రతినిధులు, జిల్లా ఇన్‌ఛార్జులు సమావేశంలో పాల్గొన్నారు. మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ "దేశంలో పెద్దఎత్తున ఓట్ల చోరీకి పాల్పడి కేంద్రంలో భాజపా మూడోసారి అధికారంలోకి వచ్చింది. ఎన్నికల కమిషన్ భాజపాకు అనుబంధ సంఘంలా పనిచేస్తోంది.

## లద్దాఖ్‌కు చైనా ముప్పు!?

**న్యూఢిల్లీ**

లద్దాఖ్‌కు పూర్తిస్థాయి రాష్ట్ర హోదా ఇస్తే సరిహద్దుల్లో ఉన్న చైనా, పాకిస్థాన్ నుంచి సమస్యలు వస్తాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తోందా!? లద్దాఖ్‌ను ఆరో షెడ్యూల్‌లో చేరిస్తే.. మిగిలిన ప్రాంతాల నుంచీ ఇటువంటి డిమాండ్లే వస్తాయని అనుమానిస్తోందా!? ఈ ప్రశ్నలకు 'ఔను' అనే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ఈ కారణంగానే చర్చల పేరిట కేంద్ర హోం శాఖ కాలయాపన చేస్తోందని ఆరోపిస్తున్నారు. నిజానికి, 2019 వరకూ లద్దాఖ్‌కు పరిమితి స్వయం ప్రతిపత్తి మాత్రమే ఉంది. స్వయం ప్రతిపత్తి కలిగిన రెండు మండళ్ల ద్వారా ఇక్కడ పాలన సాగేది. అయితే, 2019లో ఆర్టికల్ 370ని రద్దు చేసి జమ్ము కశ్మీరును కేంద్ర పాలిత ప్రాంతంగా.. లద్దాఖ్‌ను శాసనసభ లేని కేంద్ర పాలిత ప్రాంతంగా చేయడంతో ఈ మండళ్లు బలహీనమయ్యాయి. ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. అప్పుడు సామాజిక, రాజకీయ, మతపరమైన వ్యక్తులతో లే అపెక్స్ బాడీ (ఎల్ఏబీ), కార్గిల్ డెమొక్రటిక్ అలయన్స్ (కేడీఏ) ఏర్పడ్డాయి. లద్దాఖ్‌కు పూర్తిస్థాయి రాష్ట్ర హోదా ఇవ్వాలని, ఈ ప్రాంతాన్ని ఆరో షెడ్యూల్‌లో చేర్చాలని ఉద్యమం ప్రారంభించాయి. ఈ సమస్యల పరిష్కారానికి కేంద్ర హోం శాఖ 2023 జనవరిలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. కానీ, దాని పనితీరు నత్తను మరిపిస్తోంది. కమిటీ సమావేశం ఈనెల ఆరో తేదీన అంటే, సోమవారం జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే, లద్దాఖ్‌ను ఆరో షెడ్యూల్‌లో చేర్చాలన్న శాంతియుత ర్యాలీ కాస్తా హింసాత్మకంగా మారింది. ప్రస్తుత పరిస్థితుల్లో సోమవారంనాటి జరుగుతుందా లేదా అనేదీ అనుమానమే. దీనికితోడు, లద్దాఖ్‌లో పూర్తిస్థాయి శాంతి నెలకొనే వరకూ చర్చలకు దూరంగా ఉంటామని ఎల్ఏబీ, కేడీఏ ప్రకటించాయి. ఈ నేపథ్యంలో.. ఇటు చైనా, అటు పాకిస్థాన్ సరిహద్దుల్లో వ్యూహాత్మక ప్రాంతంలో లద్దాఖ్ ఉండడంతో దానికి పూర్తిస్థాయి రాష్ట్ర హోదా ఇవ్వడం లేదా ఆరో షెడ్యూల్‌లో చేర్చడంపై మోదీ ప్రభుత్వం తర్జనభర్జనలు పడుతోందని విశ్లేషకులు వివరిస్తున్నారు.

## నక్సల్స్‌తో చర్చల్లేవ్.. లొంగిపోండి

**బస్తర్**

నక్సల్స్‌తో కేంద్రం చర్చలు జరిపే ప్రసక్తే లేదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మరోసారి స్పష్టం చేశారు. లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు. ఛత్తీస్‌గఢ్ లోని జగదల్పూర్‌లో శనివారం నాడు జరిగిన ర్యాలీ లో కేంద్ర మంత్రి మాట్లాడు తూ.. నక్సల్స్ ఆయుధాలు వీడి లొంగిపోవాలని, కేంద్రం ప్రక టించిన పునరావాస పాలసీని అందిపుచ్చుకోవాలని సూచించారు. మావోయిస్టులను మార్చి 31, 2026 నాటికి నిర్మూలిస్తామని.. వారితో చర్చల ప్రసక్తే లేదంటూ బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తేల్చి చెప్పారు. మావోయిస్టులతో ఇక చర్చల ప్రసక్తే లేదన్న అమిత్ షా.. లొంగిపోవాల్సిందేనన్నారు. ఆయుధాలు వదిలేసి లొంగిపోయేందుకు ముందుకు వస్తే స్వాగతిస్తామని.. లొంగిపోయిన వారందరికీ పునరావాసం కల్పిస్తామంటూ అమిత్ షా పేర్కొన్నారు. శనివారం ఆయన 'బస్తర్ దసరా లోకోత్సవ్' కార్యక్రమంలో మాట్లాడుతూ.. మావోయిస్టులతో చర్చలు జరిపే అవసరం లేదని స్పష్టం చేశారు. మావోయిజాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు కేంద్రం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నాయి. బస్తర్ అభివృద్ధికి ప్రధాన అడ్డంకి నక్సలిజమే. బస్తర్ శాంతికి భంగం కలిగిస్తే భద్రతా బలగాలు తగిన రీతిలో సమాధానం చెబుతాయంటూ అమిత్ షా హెచ్చరించారు. ప్రధాని మోదీ ప్రభుత్వం గత 10 సంవత్సరాల్లో ఛత్తీస్‌గఢ్ అభివృద్ధికి రూ. 4 లక్షల కోట్లకు పైగా నిధులు ఇచ్చింది. మావోయిజం వల్ల తప్పుదారి పట్టినవారు హింసను వదిలి జనజీవన స్రవంతిలో కలవాలంటూ అమిత్ షా పిలుపునిచ్చారు. బస్తర్ ప్రాంతంలో శాంతికి విఘాతం కలిగించే ఎలాంటి చర్యలకైనా మావోయిస్టులు పాల్పడితే భద్రతా బలగాలు గట్టి జవాబిస్తాయని ఆయన హెచ్చరించారు. 'కొందరు వ్యక్తులు వాళ్లతో (నక్సల్స్) చర్చలు జరపాలంటూ మాట్లాడుతున్నారు. మళ్లీ చాలా స్పష్టంగా చెబుతున్నా. ఇటు ఛత్తీస్‌గఢ్‌లోనూ, అటు కేంద్రంలోనూ అధికారంలో ఉన్న మా రెండు ప్రభుత్వాలు బస్తర్‌తోపాటు నక్సల్ ప్రభావిత ప్రాంతం మొత్తాన్ని అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నాం' అని అమిత్‌షా అన్నారు. తాము ఎంతో ఆకర్షణీయమైన లొంగుబాటు పాలసీని తెచ్చామని, నక్సల్స్ ఆయుధాలు వీడి లొంగిపోవాలని కోరారు. అలా కాకుండా బస్తర్ ప్రాంతంలో శాంతికి భగం కలిగిస్తే సాయుధ బలగాలు, సీఆర్‌పీఎఫ్, రాష్ట్ర పోలీసులు తీవ్రంగా ప్రతిఘటిస్తాయని హెచ్చరించారు. బస్తర్ ప్రాంత అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని అమిత్‌షా ప్రశంసించారు. గత పదేళ్లలో ఛత్తీస్‌గఢ్ అభివృద్ధికి రూ.4 లక్షల కోట్లకు పైగా కేంద్రం కేటాయించిందని, రాష్ట్రంలోని గిరిజనుల కోసం పలు పథకాలను బీజేపీ ప్రారంభించిందని చెప్పారు.

స్వదేశీకి పట్టం కడితే..

దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు 'స్వదేశీ'కి కట్టుబడితే ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఇండియా నిలుస్తుందని, దీనిని ఎవరూ అడ్డుకోలేరని అమిత్‌షా ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఇటీవల జీఎస్‌టీ రేట్లు తగ్గించడం ద్వారా ఎంతో ఉపశమనం కలిగించారని, స్వదేశీ సంస్కృతికి మనమంతా కట్టుబడితే దేశ ఆర్థిక వ్యవస్థ అత్యున్నత శిఖరాలకు చేరుకుంటుందని తెలిపారు.

## అరేబియా సముద్రంలో పోర్టు నిర్మాణం కోసం పాక్ ప్రయత్నాలు!



అమెరికా– పాకిస్థాన్‌ల మధ్య సంబంధాలు ఇటీవల బలపడిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అరేబియా సముద్రంలో పోర్టు నిర్మాణంపై పాక్ అమెరికా అధికారులను సంప్రదించినట్లు తెలుస్తోంది. ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ ఆసీం మునీర్ ఇటీవల అగ్రరాజ్యం లో పర్యటించి సంగతి తెలిసిందే. ఆ సమయంలోనే ఈ ప్రతిపాదనలు చేసినట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఫైనాన్షియల్ టైమ్స్ కథనం ప్రకారం.. అరేబియా సముద్రంలో ఓడ రేవు నిర్మించే అంశం గురించి మునీర్ యూఎస్ అధికారుల ముందు ఉంచారు. దీంతో తమ దేశంలోని పాస్నీలో లభించే కీలక ఖనిజాల రవాణాకు దీన్ని ఉపయోగించవచ్చునేది పాక్ ఆలోచన. అఫ్గానిస్తాన్– ఇరాన్ సరిహద్దులో ఉన్న బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో ఈ పాస్నీ ఒక ఓడరేవు పట్టణం. మునీర్ వైట్‌హౌస్ పర్యటనకు ముందే ఆయన అడ్వైజర్లు యూఎస్ అధికారులతో ఈ విషయంపై చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. అయితే, అమెరికా సైనిక స్థావరాల కోసం మాత్రం ఈ ఓడరేవును ఉపయోగించుకోవడాన్ని పాక్ వ్యతిరేకించినట్లు తెలుస్తోంది. దీనికి బదులుగా పశ్చిమ పాకిస్థాన్‌లోని ఖనిజాలు లభించే ప్రావిన్స్‌లకు టెర్మినల్‌ను అనుసంధానించే రైలు కారిడార్ అభివృద్ధికి నిధులు కోరినట్లు సమాచారం. ఈ టెర్మినల్ ప్రాజెక్టు గురించి అటు అమెరికా అధికారులు కానీ.. ఇటు పాక్ అధికారులు కానీ ఎవరు స్పందించలేదు.

# లైవ్‌లో అమ్మేస్తున్నారు!

వ్యాపారం చేయాలంటే ఓ భారీ స్థాయి మాల్ కాకపోయినా.. చిన్న దుకాణం అయినా పెట్టుకోవాలి. లేదా రోడ్డుపై తోపుడు బండి అయినా నిర్వహించాలి. అదీ కాదంటే వాహనం ఆసరాగా చేసుకుని విక్రయాలు సాగించాలి. ఇదంతా సంప్రదాయ పోకడ. ఆన్ లైన్ రాకతో ప్రపంచవ్యాప్తంగా బిజినెస్ మోడల్ పూర్తిగా మారిపోయింది. సోషల్ మీడియా కాస్తా 'సోషల్ కామర్స్' అయిపోయింది. అంటే ప్రత్యక్షంగా దుకాణాలు పెట్టాల్సిన అవసరం లేకుండానే సామాజిక మాధ్యమాలను ఆసరాగా చేసుకుని వ్యాపారాలు పుట్టుకొస్తున్నాయి. ఒకటి కాదు రెండు కాదు.. కోట్ల మందికి ఇప్పుడీ ప్లాట్‌ఫామ్స్ బిజినెస్ అడ్డాలుగా అవతరించాయి. ఆన్ లైన్ లో ఉత్పత్తుల తాలూకు వీడియోలు, ఫొటోలు షేర్ చేయడం.. ఓ ఫోన్ నంబర్ ద్వారా వ్యాపారం చేయడం సాధారణం. ఈ%–%కామర్స్‌లో ఇప్పుడు లైవ్ స్ట్రీమింగ్ కొత్త ట్రెండ్. విక్రేతలు యూట్యూబ్ లైవ్, ఫేస్‌బుక్ లైవ్, ఇన్‌స్టాగ్రామ్ లైవ్ ద్వారా రియల్ టైమ్‌లో ఉత్పత్తులను ప్రమోట్ చేస్తున్నారు. వీక్షకులు తమ కామెంట్స్ ద్వారా హోస్ట్‌తో సంభాషించవచ్చు. లైవ్ పోల్స్ నిర్వహించేందుకు హోస్ట్‌కు వీలవుతుంది. తెలివైన విక్రేతలు తాము తదుపరి వారం/తేదీన పరిచయం చేయబోయే ఉత్పత్తి గురించి ముందుగానే కొన్ని వివరాలను టీజర్ రూపంలో వెల్లడించి వీక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నారు. అంతేగాక 24 గంటల కౌంట్‌డౌన్ నిర్వహించి తమ ఫాలోవర్లలో ఉత్సాహాన్ని నింపుతున్నారు. తద్వారా ఎక్కువ మంది వీక్షకులను చేరుకుంటున్నారు. సోషల్ కామర్స్ భారత్‌లో 2025లో సుమారు రూ.1,80,000 కోట్ల వ్యాపారం చేస్తుందని అంచనాలు ఉన్నాయి. దేశంలో 90 కోట్లకుపైగా ఇంటర్నెట్ యూజర్లు ఉన్నారు. వీరిలో 25 శాతానికిపైగా ఆన్ లైన్ షాపింగ్ చేస్తున్నారు.

**స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు.. వర్ధిల్లు వ్యాపారాలు**





తాము సొంతంగా తయారు చేసిన ఉత్పత్తులు, పిండి వంటలు, కళాఖండాలు, అల్లికలు, పెయింటింగ్స్.. ఒకటేమిటి, వ్యాపారానికి ఏదీ అనర్హం కాదు. వ్యాపారం చేయాలంటే ఈ రోజుల్లో ఓ స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు. ఔత్సాహికులు తక్కువ పెట్టుబడితో తమ కాళ్లమీద తాము నిలబడవచ్చు. చేతిలోని సెల్‌ఫోన్ తో వీడియోలు, ఫొటోలే కాదు.. లైవ్ స్ట్రీమింగ్ నిర్వహించి తాము విక్రయించే ఉత్పాదనను ప్రపంచానికి పరిచయం చేయవచ్చు. లైవ్ వీడియో చేయాలంటే పెద్దగా సాంకేతికంగా అవగాహన కూడా అవసరం లేదు. ఎడిటింగ్ భారం అసలే లేదు.

**దశాబ్దాల నుంచి..**

వ్యాపార సంస్థలు తమ ఉత్పత్తులు, సేవలను ప్రచారం చేయడానికి, ప్రజల్లో అవగాహన కల్పించడానికి వీడియోలు ఉపయోగిస్తున్నాయి. ఇటీవలి కాలంలో సోషల్ మీడియాలో వీడియోలు, షార్ట్స్ చూడటం పెరిగింది. ముఖ్యంగా ఉత్పత్తులు, సేవల గురించి తెలుసుకోవడానికి వీడియోలను చూసే ధోరణి ఊపందుకుంది. ఈ నేపథ్యంలో లైవ్ స్ట్రీమింగ్ ప్రాధాన్యత సంతరించుకుంది. లైవ్ స్ట్రీమింగ్‌తో షాపింగ్ ఎక్స్‌పీరియెన్స్ మారుతుందని ఈ%–%కామర్స్ దిగ్గజం అలీ ఎక్స్‌ప్రెస్ చెబుతోంది.

**వాయిదాలకు ఫుల్‌స్టాప్**

ఈ–కామర్స్ వెబ్‌సైట్లలో చాలామంది కస్టమర్లు తాము చూసిన ఉత్పాదనను తరువాత కొనొచ్చులే అని కార్ట్‌లో నిక్షిప్తం చేస్తారు. చాలా సందర్భాల్లో అవి కార్ట్‌కే పరిమితం అవుతాయి. అదే లైవ్‌లో అయితే.. నచ్చగానే ఆర్డర్ పెట్టేయొచ్చు. హోస్ట్ మీద, ఉత్పత్తి మీద నమ్మకం ఏర్పడితే.. వెంటనే ఆర్డర్ చేసేలా మనస్సు కూడా వీక్షకులను ప్రేరేపిస్తుంది అంటున్నారు మార్కెట్ విశ్లేషకులు. తరచూ వాయిదాలు వేసే కస్టమర్ల విషయంలో విక్రేతలకు లైవ్ స్ట్రీమింగ్ కలిసి వస్తుందని వారు చెబుతున్నారు.

**ప్రత్యక్షంగా వీక్షించి..**

ఆన్ లైన్ వ్యాపారంలో భాగంగా విక్రేతలు ఉత్పత్తుల తాలూకు వీడియోలు, ఫొటోలు పోస్ట్ చేయడం సర్వసాధారణం. అయితే ప్రత్యక్ష ప్రసారాన్ని నిర్వహించే వ్యక్తి (హోస్ట్) లైవ్ వీడియోలో ఉత్పత్తి గురించి పూర్తి వివరాలు వెల్లడించేందుకు వీలవుతుంది. లైవ్‌లో వచ్చే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం ద్వారా లక్షలాది మంది ఫాలోవర్లకు ప్రత్యక్షంగా అవి చేరతాయి. సందేహాలు ఉంటే నివృత్తి అవుతాయి. హోస్ట్ ఇచ్చే ప్రెజెంటేషన్ ఇక్కడ కీలకం. ప్రసంగం ఆకట్టుకునేలా ఉంటే ఉత్పత్తి పట్ల కస్టమర్లలో సానుకూల దృక్పథం ఏర్పడుతుంది. ఉత్పత్తి ఎలా పనిచేస్తుంది, ప్రత్యేకతలు, వారంటీ, గ్యారంటీ, ధర, మార్కెట్లో లభించే ఇతర ఉత్పత్తులతో పోలిస్తే తాము విక్రయించే ప్రొడక్ట్ విశేషాలను కస్టమర్లతో నేరుగా పంచుకోవచ్చు.

# నాటి ఆర్జేడీ ఆటవిక పాలనవల్లే నేటికీ బీహారీల వలసలు

ఇంటర్నెట్ డెస్క్: బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రధాన పార్టీలైన ఆర్జేడీ, జేడీయూ కాంగ్రెస్ బీజేపీ నేతలు హోరాహోరీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇవాళ ప్రధాని నరేంద్రమోదీ బీహార్ రాజధాని పట్నాలో స్కిల్స్, ఎడ్యుకేషన్‌కు సంబంధించి రూ.62 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్జేడీపైన, కాంగ్రెస్ పార్టీపైన ప్రధాని విమర్శలు గుప్పించారు. ఆర్జేడీ ఆటవిక పాలన కారణంగా బీహారీ యువత వలసలు వెళ్లాల్సి వస్తోందని ప్రధాని విమర్శించారు. ఆర్జేడీ హయాంలో విద్యావ్యవస్థ నిరాధరణకు గురైందన్నారు. పిల్లలకు సరైన విద్యావశాలు దొరకలేదని ఆరోపించారు. అభివృద్ధి లేకపోవడంతో పేదరికంలో ఉన్న పేరెంట్స్ పిల్లలను బడులకు బదులుగా పనులకు పంపారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ బీహార్ కోసం చేసిందేమీ లేదని ప్రధాని విమర్శించారు. ఓ కాంగ్రెస్ నాయకుడు ఎన్నికలు ఎక్కడ ఉంటే అక్కడ వాలిపోయి అసత్యాలు ప్రచారం చేస్తుంటాడని రాహుల్‌గాంధీని ఉద్దేశించి అన్నారు. నితీశ్‌కుమార్ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు బీహార్‌ను ఎంతో అభివృద్ధి చేసిందని ప్రశంసించారు. ఇప్పుడు ఆ కాంగ్రెస్ నాయకుడి అబద్ధపు ప్రచారాలను బీహారీలు నమ్మే పరిస్థితి లేదని చెప్పారు. గత రెండేళ్లలో బిహార్ ప్రభుత్వం 50 లక్షల మంది యువతకు ఉపాధి



కల్పించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. యువత సామర్థ్యాన్ని మరింత పెంచడానికి ఎన్డీఏ ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పని చేస్తోందన్నారు. ఆర్జేడీ, కాంగ్రెస్‌ల పాలనతో పోలిస్తే నితీశ్ ప్రభుత్వం బిహార్ విద్యా బడ్జెట్‌ను అనేక రెట్లు పెంచిందన్నారు. అందువల్లే నేడు బిహార్‌లోని మారుమూల గ్రామాల్లో కూడా పాఠశాలలు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 19 జిల్లాలకు కేంద్రీయ విద్యాలయాలను ఆమోదించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 'స్టూడెంట్ క్రెడిట్ కార్డ్' ద్వారా పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించడానికి మద్దతిస్తోందన్నారు.

20 ఏళ్ల క్రితం బిహార్‌లో విద్యావ్యవస్థపై జరిగిన విధ్వంసం వల్ల యువత ఇతర రాష్ట్రాలకు తరలిపోవాల్సి వచ్చిందని ప్రధాని అన్నారు. అప్పటి ప్రభుత్వం చేసిన తప్పు వల్ల బిహార్‌కు వలసలు ప్రధాన సమస్యగా మారాయన్నారు. వాటిని అరికట్టాలంటే రాష్ట్రంలోనే ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని.. అందుకు అనుగుణంగా నీతీశ్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. తమ ప్రభుత్వం గత దశాబ్దంలో దేశంలో 5,000 ఐటీఐల ను ప్రారంభించిందని.. అవి పారిశ్రామిక విద్యకు ముఖ్యమైన కేంద్రంగా మాత్రమే కాకుండా 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి వర్క్‌షాప్‌లుగా కూడా పనిచేస్తున్నాయన్నారు.

దేశంలోనే బిహార్‌లో అత్యధిక యువ జనాభా ఉందని.. బిహార్ యువత సామర్థ్యం పెరిగినప్పుడు సహజంగానే దేశ బలం కూడా పెరుగుతుందని ప్రధాని మోదీ అన్నారు. కాంగ్రెస్ పాలనలో ఎన్నో ఏళ్లు యువత ఉద్యోగాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని.. దాంతో దేశంలో అభివృద్ధి కుంటుపడిందని మోదీ మండిపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రస్తుతం భారత్ మూడో ఆర్థికశక్తిగా రూపుదిద్దుకునేందుకు సిద్ధమవుతోందన్నారు. బిహార్‌లో విద్యార్థుల కోసం పలు అభివృద్ధి పథకాలను ప్రారంభించారు. దిల్లీ విజ్ఞాన్ భవన్‌లో పీఎం–సేతు పథకాన్ని ప్రారంభించారు. ఇది విద్యార్థుల విద్యా, నైపుణ్యాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు.

## విజయ్‌కు చేరువయ్యేందుకు బీజేపీ పావులు.. సమీకరణలు మారనున్నాయా..

**న్యూఢిల్లీ**

తమిళనాడులోని కరూర్‌లో టీవీకే చీఫ్ విజయ్ నిర్వహించిన ర్యాలీలో తొక్కిసలాట అనంతర నేపథ్యంలో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నట్టు కనిపిస్తోంది. విజయ్ పార్టీ టీవీకే కు చేరువయ్యేంతకు బీజేపీ పావులు కదుపుతోందని విశ్వసనీయ వర్గాల సమాచారం. విజయ్‌కు ఉన్న విస్తృతమైన అభిమానుల ఫాలోయింగ్‌ను 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ఉపయోగించుకునే ఆలోచనలో బీజేపీ ఉందని అంటున్నారు. ఇందులో భాగంగా విజయ్‌ను డీఎంకే అన్యాయంగా టార్గెట్ చేసినప్పటికీ అతను ఒంటరి అయినట్టు కాదని బీజేపీ సీనియర్ నేత ఒకరు టీవీకే నాయకత్వానికి సంకేతాలు పంపారని తెలుస్తోంది. డీఎంకేను అన్నిరకాలుగా కార్నర్ చేయాలని తాము కూడా కోరుకుంటున్నందున విజయ్‌ను సహనంతో ఉండాలని బీజేపీ సూచించినట్టు చెబుతున్నారు. కరూర్ తొక్కిసలాట సంక్షోభం అనంతరం విజయ్ భవిష్యత్ పొలిటికల్ ర్యాలీలపై అనిశ్చితి ఏర్పడింది. ఇది తన జీవితంలో ఎన్నడూ చూడని విషాదకర ఘటన అని, ఇది తనను ఎంతో బాధించిదనీ, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో తనకు బాసటగా నిలిచిన రాజకీయ పార్టీలకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానని ఇటీవల విజయ్ ఒక వీడియో సందేశంలో పేర్కొన్నారు.

**సోలోగానే..**

టీవీకే ఒంటరిగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తుందని విజయ్ ఇటీవల ప్రకటించారు. అయితే ఇటీవల జరిగిన పరిణామాలతో ఆయన తన రాజకీయ వ్యూహాలలో మార్పులు చేసుకునే అవకాశాలున్నాయని అంటున్నారు. ఇక.. అధికార డీఎంకే ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని బీజేపీ బలంగా నమ్ముతోంది. ఈ నేపథ్యంలో టీవీకేను కూడా తమతో కలుపుకొని వెళ్లిన పక్షంలో వ్యతిరేక ఓట్లు చీలకుండా గంపగుత్తుగా ఎన్డీయే కూటమికే పడే అవకాశాలు ఉంటాయని విశ్వసిస్తోంది. సెప్టెంబర్ 27 తొక్కిసలాట ఘటన అనంతరం బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే బృందం కరూర్‌లో పర్యటించింది. 41 మంది మరణానికి దారితీసిన తొక్కిసలాటకు కేవలం టీవీకేనే తప్పుపట్టడం సరికాదని, ప్రభుత్వ నిర్వహణా లోపాలే ప్రధాన కారణమని బీజేపీ చెబుతోంది.

## దేశ పౌరుల రక్షణ కోసం భారత్ ఏ హద్దులనైనా మీరుతుంది



పాకిస్థాన్‌ను ఉద్దేశించి భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేశారు. దేశ పౌరుల రక్షణ కోసం భారత్ ఏ హద్దులనైనా మీరుతుందని ఆయన గట్టిగా చెప్పారు. దేశ పౌరుల భద్రతకు, దేశ సమగ్రతకు ముప్పు పొంచి ఉంటే ఎలాంటి నిర్ణయాత్మక చర్యలకు దిగుతామో ఇప్పటికే నిరూపించామని అన్నారు. 2016 సర్జికల్ స్ట్రైక్, 2019 బాలాకోట్ ఎయిర్‌స్ట్రైక్, ఇటీవల చేపట్టిన ఆపరేషన్ సింధూర్ అందుకు నిదర్శనమని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. దేశ రాజధాని ఢిల్లీలో జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ నిర్వహించిన జీxూ ఏశీఅఅవష్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాకిస్థాన్ భూభాగంలో భారత్ సర్జికల్ స్ట్రైక్స్ చేసినప్పుడు తాము మతం చూడలేదని, కానీ పహల్గాంలో పౌరులను మతం అడిగి చంపారని రాజ్‌నాథ్ మండిపడ్డారు. తమ ప్రభుత్వం పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుందని, సైన్యం జోలికిగానీ, సాధారణ పౌరుల జోలికిగానీ వెళ్లలేదని రాజ్‌నాథ్ చెప్పారు. మేం ఆ పని చేయాలనుకుంటే ఎప్పుడో చేసేవాళ్లమని, కానీ తాము అలా చేయలేదని అన్నారు.

## సంపాదకీయం

# విద్య పరిరక్షణ అందరి బాధ్యత

ఏటా అక్టోబర్ 5న ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకొనే సంప్రదాయం 1994లో ప్రారంభమైంది. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం 5 అక్టోబర్, 1966 నాటిది. ఉపాధ్యాయులను మరియు వారి వృత్తిని ప్రభావితం చేసే సమస్యలను విశ్లేషించడానికి ఫ్రాన్స్‌లోని పారిస్ లోని ఉపాధ్యాయుల స్థితిగతులపై ప్రత్యేక ఇంటర్ గవర్నమెంటల్ సమావేశం ఏర్పాటు చేయబడింది. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని అంతర్జాతీయంగా గుర్తించి ప్రపంచ వ్యాప్తంగా జరుపు కోవాలని ఎడ్యుకేషన్ ఇంటర్నేషనల్ (ఇఐ) (ప్రపంచవ్యాప్తంగా విద్యా నిపుణులను సూచించే గ్లోబల్ యూనియన్ ఫెడరేషన్) సూచించింది. 100 కి పైగా దేశాలు ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటాయి. ఎడ్యుకేషన్ ఇంటర్నేషనల్ మరియు దాని 401 సభ్య సంస్థల ప్రయత్నాలు ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా వ్యాప్తి చేయడానికి మరియు దాని గుర్తింపుకు దోహద పడ్డాయి. అక్టోబర్ 5 ప్రపంచ పిల్లలకు విద్యను అందించడంలో బోధనా వృత్తి చేసిన కృషిని గుర్తు చేస్తుంది. ఉపాధ్యాయ దినోత్సవం వాస్తవానికి మన జీవితంలో ఉపాధ్యాయులు పోషిస్తున్న కష్టాలను, సవాళ్లను మరియు అసమానమైన పాత్రను గుర్తించే వేడుక భావి తరాలకు విద్యా ప్రణాళికలు ఎలా ఉండాలనే అంశంపై ఉపాధ్యాయుల మద్దతు కూడగట్టేందుకు విద్యాలయాలలో వేడుకగా దీన్ని నిర్వహిస్తున్నారు. విద్యను పొందడం మాత్రమే హక్కు కాదు, సరైన ఉపాధ్యాయుడి వద్ద విద్యను అభ్యసించడం కూడా హక్కే. ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవం ప్రధాన లక్ష్యం 'విశ్వ వ్యాప్తంగా ఉన్న విద్యా వేత్తలను ప్రశంసించడం వారి నైపుణ్యాలను అంచనావేయడం, వాటిని మెరుగు పరచడం'. బోధనకు సంబంధించిన సమస్యలను చర్చించు కోవడానికి దీన్ని ఒక అవకాశంగా పరిగణి స్తున్నారు. కాలం ఎంతగా మారినా మన సమాజం ఉత్తమ ఉపాధ్యా యులను అధికంగా తయారు చేయలేక పోతుందనేది సత్యం. సాధారణ ఉపాధ్యాయుడు పాఠాల్ని బోధిస్తాడు. మంచి ఉపాధ్యాయుడు వాటిని వివరిస్తాడు. ఉత్తమ ఉపాధ్యా యుడు విశదీకరిస్తాడు. గొప్ప ఉపాధ్యాయుడు స్ఫూర్తిని అందిస్తాడు. గురువుల బోధనతోనే విద్యార్థులు ప్రపంచాన్ని తెలుసు కుంటారు, ఉన్నత వ్యక్తులుగా ఎదుగుతారు. ప్రపంచంలో సుమారు 80కోట్ల మంది నిరక్షరాస్యులు ఉండగా అందులో 23.8 కోట్ల మంది మనదేశం లోనే ఉన్నట్లు వెల్లడైంది. 'ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ యునెస్కో అక్టోబర్ 5వ తేదీని 'వరల్డ్ టీచర్స్ డే'గా ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది ప్రసిద్ధ గురువులు ఉన్నారు. న్యూటన్, పైథాగరస్, సర్వేపల్లి రాధాకృష్ణన్ మొదలైన వారు ఆదర్శంగా నిలిచారు. విశ్వా మిత్రుడు, సాందీపుడు, పరశు రాముడు, ఆదిశంకరాచార్యులు, ద్రోణా చార్యులు, పరమహంస మొదలైన వారంతా పేరొందిన గురువులు. విద్య అనే ఆస్తిని సమానంగా పంచగల శక్తి ఒక ఉపాధ్యాయుడికే ఉంది. ప్రజాదరణ, అపారమైన గౌరవం ఉన్న కారణంగానే ఎంతోమంది ఉపాధ్యాయులు నాయకులయ్యారు. వీరిలో ముఖ్యంగా చెప్పుకోవాల్సిన వారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. ఒక అధ్యాపకుడు భారత దేశానికి రాష్ట్రపతిగా పనిచేసిన ఘనత ఆయనకే చెల్లింది. ఆయన పుట్టిన రోజును మన దేశంలో ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపు కుంటాము. ప్రఖ్యాత శాస్త్రవేత్త అబ్దుల్ కలాం రాష్టపతిగా పదవీకాలం ముగియ గానే చెన్నైలోని అన్నా విశ్వ విద్యాలయంలో అధ్యాపకుడిగా చేరారు. బోధన చేస్తూనే ఆయన తుదిశ్వాస విడిచారు. యావత్ ప్రపంచానికి ఆయన గొప్ప సందేశాన్ని అందించారు. జ్ఞాన సముపార్జన గురువు బోధన వలనే సంపూర్ణంగా సిద్ధిస్తుంది. 'గు'శబ్దంధకారే స్వాత్/ 'రు'శబ్దంతి నిరోధతః, అంధకార నిరోధితం/ గురురీత్య బిదీయతే... అనే ఆర్యుల మాటలను పరికించి చూస్తే 'అజ్ఞానమనే అంధకారాన్ని పారద్రోలి జ్ఞానమనే కాంతులను వెలిగించే వారినే నిజమైన గురువులుగా భావించవచ్చు. నీతివంతమైన జీవనానికి అలవాటుపడే విద్యార్థులను ఉపాధ్యాయులు తీర్చిదిద్ద గలగాలి. సమాజాలు మారొచ్చు, సిద్ధాంతాలు మారొచ్చు. కానీ విద్యార్థి, ఉపాధ్యాయుల మధ్య సంబంధం శాశ్వతమైనది. ఈ విషయాన్ని యువ ఉపాధ్యా యులు గుర్తుంచు కోవాలి. విద్యార్థుల భవిష్యత్‌పైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. సమాచారం అందివ్వడంతోనే ఉపాధ్యాయుడి పాత్ర ముగియదని నిజానికి ఉపాధ్యాయుడు రకరకాల నైపుణ్యాల్ని విద్యార్థులకు అందించ వలసి ఉంటుందని కొఠారి కమిషన్ పేర్కొంది. జాతి నిర్మాణంలో తల్లిదండ్రుల తర్వాత కీలకపాత్ర పోషించేది గురువే అవుతాడు. అనేక మంది గురువులు విద్యార్థుల మదిలో ప్రముఖ స్థానాన్ని ఏర్పరుచు కున్నారు. ఇందుకు ఉదాహరణ లుగా శ్రీరాముడు- విశ్వామిత్రుడు, శ్రీకృష్ణుడు- సాందీపుడు, శివాజీ- సమర్థ రామదాసు, వివేకానంద- రామకృష్ణ పరమ హంసలను పేర్కొనవచ్చు. మాతృదేవోభవ- పితృదేవోభవ- ఆచార్య దేవోభవ అన్నారు పెద్దలు. తల్లిదండ్రుల తరువాతి స్థానం గురువుదే అని స్పష్టం చేశారు. ఉపాధ్యాయ వృత్తిలో అడుగు పెట్టేవారు తమ వృత్తిని ప్రేమించే లక్షణం కలిగి ఉండాలి. తాము భావి పౌరులను తీర్చిదిద్దు తున్నామనే భావన ఉండాలి. విద్యార్థి ఎగిరే గాలిపటం అయితే దానికి ఆధారమైన దారం గురువు. ఉపాధ్యాయులు తమ మేధో సంపత్తిని పెంపొందించు కోవాలి. తమ జీవిత కాలంలో కనీసం నాలుగు తరాల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందనే విషయాన్ని గమనించాలి. వృత్తి నైపుణ్యాల పెంపు, కంప్యూటర్ వినియోగం, డిజిటల్ లిటరసీ కార్యక్రమాలను నిర్వహిం చాలి. బాలబాలికల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పరిచేందుకు కృషిచేయాలి. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 'మార్చలేని గతాన్ని గురించి ఆలోచించవద్దు.. చేతిలోఉన్న భవిష్యత్తు కోసం శ్రమించు' అనేవారు. ఉపాధ్యాయుడు తన బోధనా పద్ధతుల్ని పునః సమీక్షించుకొని తదనుగుణంగా విద్యార్థులను నవ సమాజానికి అందించాలి. ఒకప్పుడు గుమాస్తాలను తయారుచేసే విధంగా విద్యాలక్ష్యం వుండేది. నేడు సామాజిక ప్రాధాన్యతలు మారి పోయాయి. దేశానికి పరిశోధకులు కావాలి. వ్యక్తుల స్వభావాన్ని, సామర్థ్యాన్ని, వారి భవిష్యత్తును తీర్చిదిద్దే పవిత్రమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని ప్రవచించిన అబ్దుల్ కలాం పలుకులకు సార్థకత చేకూర్చాలి. నేటి యువ ఉపాధ్యాయులు అందుకు కంకణ బద్ధులై వృత్తిని నిబద్ధతతో నిర్వర్తించాలి. కోవిడ్ 19 మహమ్మారి ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా విద్యావ్యవస్థలు ఎదుర్కొంటున్న సవాళ్లకు ఊతమిస్తున్నది. ఇప్పుడు గతంలో కంటే, విద్యా హక్కును పరిరక్షించడానికి ప్రతి ఒక్కరూ ఉపాధ్యాయులతో కలిసి పనిచేయాలి. ఉపాధ్యాయ లోకం కానీ రిమోట్ లెర్నింగ్ అందించ డానికి, వెనక బడుతున్న విద్యార్థులకు మద్దతు ఇవ్వడానికి, పాఠశాలలను తిరిచుసందున అభ్యాస అంతరాలను తగ్గించేలా ఉపాధ్యాయుల కృషి పరంగా ఇది చాలా కీలక సమయం. విద్య యొక్క భవిష్యత్తును మరియు బోధనా వృత్తిని రూపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా ముఖ్యం..

# అలుపెరుగని కమ్యూనిస్టు యోధుడు

యజుర్వేద శాఖీయులు అయినపేరేప వంశజులు శ్రీకాకుళానికి ఇరవై కిలోమీటర్ల దూరంలోని పేరేప గ్రామ పరిసరాలలో పురోహితులుగా కాక, దేవాలయ ప్రతిష్ఠలు, కళ్యాణాలు చేయించే వేద పండితులుగా పేరెన్నిక గన్నారు. అలాంటి సనాతన వైదిక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి, పక్కా కమ్యూనిస్టుగా పేరొందిన ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు పేరేప మృత్యుంజయుడు. నమ్మిన సిద్ధాంతాల కోసం జీవితాన్ని అంకితం చేసిన ఆ త్యాగమూర్తి జయంతి సందర్భంగా, లభ్యం అవుతున్న సమాచారం ఆధారంగా గుర్తు చేసుకునే చిరు ప్రయత్నం. పేరేప మృత్యుంజయుడు (అక్టోబర్ 5, 1914 - మే 16, 1950) భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటలో పేరేప వెంకట సుబ్బయ్య, మహా లక్ష్మిలకు 1914, అక్టోబర్ 5 న జన్మించారు. ఆచంటలో మాధ్యమిక పాఠశాల చదువయ్యాక ధవళేశ్వరం వెళ్లి మేనమామ మొక్కపాటి శేషయ్య ఇంట్లో ఉంటూ రాజమండ్రి ప్రభుత్వ మోడల్ సెకండరీ స్కూలులో చదివి, చదువయ్యాక (1933-34లో) పి.డబ్ల్యు.డిలో రోజు కూలికి మేస్త్రీగా పని చేశారు. 1925 ప్రాంతంలో భానుమతి (1917)ని వివాహ మాడారు. 1936 లో నెక్కంటి నరసింహారావు, మీరా లతో పాటు కమ్యూనిస్టు పార్టీ సభ్యులయ్యారు. బస్సు డ్రైవరుగా పనిచేస్తున్న మీరాతో పాటు బస్సు కార్మికులను సంఘటిత పరచే కార్యక్రమం చేపట్టారు. 1941-42 ప్రాంతంలో యంవియన్ కపర్దీని కూడా మోటారు కార్మిక సంఘ నిర్మాణంలో పాల్గొనేందుకు ప్రోత్సహించారు. 1937-39 కాలంలో కాళీపట్నం రైతుల పోరాటానికి నాయకత్వం వహించిన అల్లూరి సత్య నారాయణ రాజు, ఉద్దరాజు రామం లతో కలిశారు. 1940-42 కాలంలో చినమల్లం గ్రామం వద్ద 60- 70 మంది పార్టీ కార్యకర్తలకు మృత్యుం జయుడు ప్రిన్సిపాలుగా నిర్వహించిన శిక్షణా శిబిరంలో సైద్ధాంతిక శిక్షణతో బాటు, ఇందుకూరి సుబ్బరాజు ఆధ్వర్యంలో కొంత మిలటరీ శిక్షణ కూడా యిచ్చారు. మృత్యుం జయుడు... వ్యవసాయ కూలీలతో ఆచంట నుంచి నరసాపురం తహశీల్దారు కార్యాలయానికి 1940లో ఆకలి యాత్ర నిర్వహించారు. 1940-42 మధ్య కొంత కాలం ఆయన జిల్లా పార్టీ కార్యదర్శిగా ఉన్నారు. ఏలూరులో జిల్లా పోలీసు స్పెషల్ బ్రాంచి వారు ఆయనను అరెస్టు చేసి, స్థానిక జిల్లా సబ్ జైలులో 15 రోజులు రిమాండులో వుంచారు. 1944 - 45లో జైలు నుంచి విడుదల అయినాక పాలకొల్లులో కాపురం పెట్టారు. నరసాపురం తాలూకా పార్టీ కార్యదర్శిగా వుంటూ, జిల్లా ప్రజానాట్య మండలి ఆర్గనైజరుగా ఉన్నారు. అల్లు రామలింగయ్య, పినిశెట్టి శ్రీరామ మూర్తి, చలం మొదలగు కళాకారులను ప్రజానాట్య మండలిలోకి తెచ్చింది మృత్యుంజయుడే. నెక్కల పూడి సుబ్బాయమ్మ గారితో కలిసి అన్నా చెల్లెలు పాట (బెంగాలులో కరువు) వేదికల మీద పాడే వారు. చావుకు వెరవకురా అన్న పాట తరచు ఒంటరిగా కూడా పాడుకొంటుండే వారని చంద్ర సావిత్రమ్మ, కొండేపూడి రాధ తదితరులు చెపుతుండే వారు. పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, వావిలాల గోపాల కృష్ణయ్య లతో పాటు, ప్రత్యేకంగా తెలంగాణ పోరాటానికి సహాయం కూడ గట్టడానికి పి.సి.జోషి, పుచ్చలపల్లి సుందరయ్యలు వచ్చి ఆయనతో చర్చలు జరిపారు. మృత్యుంజయుడు నరసాపురం తాలూకా పార్టీ కార్యదర్శిగా, జిల్లా ప్రజానాట్య మండలి ఆర్గనైజరుగా వున్నారు. రెండవ ప్రపంచ యుద్ధపు చివరి రోజుల్లో బెంగాల్ లో భీకరమైన కరువు, తెలంగాణ రైతాంగ పోరాటం నేపథ్యంలో నిత్యావసర వస్తువుల కటకట, దొంగ నిల్వలు, దొంగ రవాణా నివారణకు కృషి చేస్తూ, ఆకలి యాత్రలు నిర్వహించారు. బెంగాలు కరువు, తెలంగాణ పోరాటం గురించి అల్లు రామలింగయ్య, పినిశెట్టి శ్రీరామమూర్తి, చలం మొదలగు కళాకారులతో కలిసి, ప్రజానాట్య మండలి ప్రదర్శనలు ఇచ్చేవారు. నెక్కల పూడి సుబ్బాయమ్మతో కలిసి "అన్నా చెల్లెలు" పాట (బెంగాలులో కరువుకు సం బంధించి) వేదికల మీద పాడే వారు. "చావుకు వెరవ కురా" అన్న పాట వేదికల నుంచి గంభీర స్వరంతో పాడడమే కాక, తరచు ఒంటరిగా కూడా పాడుకొంటుండే వారని చంద్ర సావిత్రమ్మ, కొండేపూడి రాధ చెప్పేవారు. నిజంగా జీవితంలో కూడా ఆయన "చావుకి వెరవని" వ్యక్తి. 1945-46లో పాల కొల్లులో మునిసిపల్ కార్మికుల సమ్మె జయప్రదంగా జరగతంలో ఆయన పాత్ర ఉంది. 1946లోనే సాధారణ ఎన్నికలు జరిగిన క్రమంలో, పార్టీ అభ్యర్థి తరఫున పోలింగు ఏజెంటుగా మోటారు సైకిలు మీద నరసాపురం అసెంబ్లీ నియో జకవర్గం అంతా తిరిగారు. భీమిరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, వావిలాల గోపాల కృష్ణయ్య తెలంగాణ పోరాటానికి సహాయం కూడగట్టడానికి వెళ్ళిన సందరంగంలో పెద్ద బహిరంగ సభ జరిగింది. ఆ తర్వాత, పి.సి.జోషి, పి.సుందరయ్యలు ప్రత్యేకంగా ఆయనతో చర్చలు జరిపారు. అంతకుముందు "ప్రజాశక్తి" వార పత్రిక, ద్వైవార పత్రికానున్న సందర్భంగా విరాళాలకి ప్రకటన వచ్చింది. ఆయన తనకి పెళ్లికి అత్తవారిచ్చిన వెండి మరచెంబు, కంచం అమ్మి పంపించారు. 1946లోనే మళ్లీ రహస్య జీవితం మొదలయింది. 1948లో గాంధీజీ హత్య తర్వాత మళ్లీ కమ్యూనిస్టు పార్టీ మీద నిషేధం జరిగింది. విజయవాడలో కమ్యూనిస్టు, ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తల మధ్య ఘర్షణలు జరగగా, అరెస్టు అయి కైకలూరు సబ్ జైలులో దాదాపు 3 నెలలున్నాక తప్పించుకొని మళ్ళీ రహస్య జీవితంలోకి వెళ్ళారు. 1948లో పోలీసు చర్య తర్వాత తెలంగాణ లోనే కాక వెన్నుదన్నుగా వున్న కోస్తా ఆంధ్ర జిల్లాలలోనూ కమ్యూనిస్టు శ్రేణులు ఆత్మరక్షణ చేసుకొనే స్థితిలో పడ్డాయి. పార్టీ ఆదేశం ప్రకారం కామ్రేడ్స్ ఇతర ప్రాంతాలకి తరలి వెళ్ళారు. మృత్యుంజయుడు, సంకు అప్పారావు, మరి కొందరు, ఒరిస్సా వెళ్లేందుకు రాజమండ్రిలో ఒక రహస్య స్థావరానికి చేరారు. ఇంతలో స్థావరం యిచ్చిన వ్యక్తి ప్రభుత్వం యిచ్చే పారితోషికానికి ఆశపడి పోలీసులకి ఆచూకీ యిచ్చాడు. సుందరయ్య 'వీర తెలంగాణ విప్లవ పోరాటం- గుణపాఠాలు" ప్రకారం మిగతా వారిని పంపించి ఆయన ఖమ్మం ప్రాంతంలో పోరాట శ్రేణుల్లో చేరవలసి వచ్చింది. పట్టుబడిన వారందరూ చిత్ర హింసలకి గురయ్యారు. మృత్యుం జయుడు పట్టుబడిన కబురు తెలిసి అందరూ స్థావరం మార్చుకున్నారు."మా స్థావరం ఆయనకు తెలుసు, వచ్చి మమల్ని కలుసుకోవలసి వుంది. ఆయన ఆ బాధలు భరించినందువల్ల మే బతికిపోయాం" అని రాజేశ్వరరావు, సుందరయ్య చెప్పేవారు. 1950 మే 16 బొమ్మూ రు మొట్ట దగ్గర చనిపోయినట్లు పత్రికల సమాచారం ఇచ్చాయి. కాల్చిన యస్.ఐ తనికెల సుబ్బారావు రిటైరైన తర్వాత... ఫొటోగ్రాఫర్ భూషణ్‌ను కలిసి, కానిస్టేబుళ్ళు మృత్యుంజయుని కాల్చడానికి నిరాకరించగా తాను కాల్చవలసి వచ్చిందని, ఆఖరి గుండు పేల్చే వరకూ ఆయన జయజయ నినాదాలు చేస్తూ నిలబడి వున్నారని చెప్పినట్లు సమాచారం. అప్పటి సహచరులు, కొరియరులు ఎందరో తమ పిల్లలకు మృత్యుంజయుడు అని పేరు పెట్టు కున్నారు. రాజమండ్రి సెంట్రల్ జైలు దగ్గర రిక్షా కార్మికులు తమ కాలనీకి మృత్యుంజయ నగర్ అని పేరు పెట్టారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపు రంలో "మృత్యుంజయ నగర్ కాలనీ", గ్రంథాలయం ఏర్పడ్డాయి.

# గురు: సాక్షాత్ పరబ్రహ్మ

సామాన్య మానవుడు ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేర్చగల ధీర మేధావి గురువు. తొలి అక్షరం దిద్దించడం, వ్యక్తిత్వ వక్రగుణాలను సవరిస్తూ, సన్మార్గాలను చూపుతూ, అత్యున్నత స్థాయికి ఎదిగే వరకు మన వెంట నిడిచి, వెన్నెముకలా నిలిచి, నిరాశలో ఆశల విత్తులు నాటుతూ, కొవ్వత్తిలా తను కరిగిపోతూ రేపటి తరానికి దారి దీపంగా నిలుస్తూ, తడబడినపుడు ఊత కర్రగా మారగల మహోన్నత దైవ రూపం, నడిచే ఆదర్శాల నిధి గురువు మాత్రమే. పాఠ్యాంశాలను బోధిస్తూ, వెన్నుతట్టి నడక, నడతల్ని నేర్పుతూ, జ్ఞానోదయాన్ని కలిగించగల నిస్వార్థ జీవి ఉపాధ్యాయుడు. ఢిల్లీకి రాజైన సద్గురువుకు పాదాభివందనం చేసేది భాధ్యతగల శిష్యుడే. పెరిగే మొక్కకు ఊత కర్ర ఉపాధ్యాయుడు. భగవంతుడితో భక్తుడి సంబంధం లాంటిదే గురు శిష్యుల పరమ పవిత్ర సంబంధం. గురువులు సృష్టి కర్త వంటి వారు. విద్యార్థికి జ్ఞానాన్ని అందించి, కొత్త విషయాలను నేర్పించే పాత్రను పోషిస్తారు. గురువు మార్గ నిర్దేశనం చేస్తూ, మోక్షం వైపు నడిపిస్తారు. గురువు పరంధాముడు, అజ్ఞాన చీకట్లను చిదిమేసి జ్ఞానోదయం కలిగించే వారు. గురువు పరివర్తకుడు, భవిష్యత్తు తీర్చిదిద్దే మేధావి. ప్రపంచవ్యాప్తంగా 94 మిలియన్లకు పైగా ఉపాధ్యాయుడు భావితరాలకా నిర్మించడంలో నిమగ్నం అవుతున్నారు. ఉపాధ్యాయుడు రేపటి తరం నిర్మాతలు. తరగతి గదుల్లోనే జాతి నిర్మాణం జరుగుతుంది. గురువుకను నమ్మిన శిష్యుడికి ఎదురుండదు. గురువు ప్రాధాన్యాన్ని గుర్తించిన యునెస్కో సంస్థ ప్రతి ఏట 05 అక్టోబర్ రోజు "ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం (వరల్డ్ టీచర్స్ డే)"గా 1966 నుంచి పాటించడం ఆనవాయితీగా మారింది. 2025 ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ ఇతివృత్తంగా "ఉపాధ్యాయుల అభిప్రాయాలకు విలువ ఇద్దాం : సరికొత్త విద్యా ఒప్పందం దిశ వైపు" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. విజ్ఞానం, లోక జ్ఞానం, వ్యక్తిత్వ వికాసం, వివేకం, విద్యాబుద్ధులు, శాస్త్రీయ దృక్పథం, మంచి అలవాట్లు, ప్రేరణ కల్పించడం, పొరపాట్లను నిర్దయగా సవరించడం, కెరీర్ నిర్మించడం లాంటి బహుముఖీల లక్ష్యాలను మదిలో నింపుకొని తమ విధులను సక్రమంగా, పవిత్రంగా నిర్వహించే గురువులు శిష్యుల దృష్టిలో బ్రహ్మ సమానులే. పుస్తకాల్లో పాఠాలను మాత్రమే బోధించే వారు సాధారణ ఉపాధ్యాయులు. పాఠ్యాంశాలతో పాటు హృదయపూర్వకంగా విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే మహాముభావులు మాత్రమే సద్గురువులు. పిల్లల్లో దయ, కరుణ, ఉత్సుకత, ధైర్యం, ఆత్మ విశ్వాసం, క్రమశిక్షణ అనబడే విత్తులు నాటి నీడనిచ్చే మహా వృక్షాలుగా మార్చగల మహోన్నతులు సద్గురువులు. ఓపిక, బేషరతు త్యాగాల ప్రతిరూపం ఉపాధ్యాయులు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం వేదికగా మన గురువులకు కృతజ్ఞతలు తెలపడం, వారి దీవెనలు పొందడం, వారిని మనస్ఫూర్తిగా సన్మానించడం, సుదూర ప్రాంతాల్లో ఉన్న ఉపాధ్యాయులకు ప్రేమపూర్వకంగా ఉత్తరాలు రాయడం, విద్యాలయాల్లో సెల్ఫ్ గవర్నమెంటు డే పాటించడం, వారి సేవలను కొనియాడడం, విద్యాలయాల్లో పలు పోటీలను నిర్వహించడం లాంటి పలు కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుంది. నిస్వార్థ ప్రేమ, గౌరవం, కృతజ్ఞతలను తెలుపడానికి ఈ వేదిక ఎంతగానో ఉపకరిస్తుందని గమనించాలి. కంచే చేనును మెసినట్లు, నేటి ఉపాధ్యాయుల్లో కొందరు విధులను నిర్లక్ష్యం చేయడం, విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడం, విధి నిర్వహణలో ఆల్కహాల్ సేవించడం, కాలక్షేపం కోసం ఉద్యోగం చేయడం, అభ్యంతరకరంగా ప్రవర్తించడం అత్యంత విచారకరం. అన్ని వృత్తుల మేధావులను తయారు చేసే సర్వ సాధారణ వ్యక్తులు గురువులే అని మనకు తెలుసు. గురు బోధనలు మన జీవితాంతం మన వెంట వస్తాయి. విద్య అనే శక్తివంతమైన ఆయుధంతో ప్రపంచాన్ని సర్వాంగ సుందర ప్రదేశంగా మార్చవచ్చు. ఆవిష్కరణలు, సృజన ఆలోచనలు, స్ఫూర్తి రగల్చడం, సానుకూల మార్పులకు ఉత్ప్రేరకంగా పని చేసేది ఉపాధ్యాయుడు మాత్రమే. ప్రతి విజేత వెనుక ఉపాధ్యాయుడి అదృశ్య హస్తం ఉంటుంది. రేపటి తరం నిర్మాతలుగా నేటి ఉపాధ్యాయులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించి డిజిటల్-ఏఐ తరగతి గదుల్లో సాంప్రదాయంతో బోధనలు చేయడానికి ముందుకు రావాలని, ప్రతి విద్యార్థిని బాధ్యతగల పౌరులుగా మార్చడానికి కృషి చేయాలని కోరుకుందాం. గురుః బ్రహ్మ గురుః విష్ణు గురు దేవో మహేశ్వరః / గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురువే నమః


# దారి తప్పిన బాల్యం...

ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కూకట్‌పల్లి మైనర్ బాలిక సహస్ర హత్య కేసు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. పోలీసుల విచారణలో ఈ హత్య కేసుకు సంబంధించిన కొన్ని నివ్వెరపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. 14 ఏళ్ల బాలుడు క్రికెట్ బ్యాట్ కోసం సహస్రను హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. పదవ తరగతి కూడా పూర్తికాని 14 ఏళ్ల బాలుడు 11 ఏళ్ళ అమ్మాయిని అతి కిరాతకంగా హత్య చేయడం ఏంటి? ఇంతటి దారుణానికి ఒడిగట్టడానికి గల కారణాలేంటనే ప్రశ్నలు అందరి మదిలో తలెత్తుతున్నాయి. బాలుడు క్రికెట్ బ్యాట్ దొంగతనం కోసం పక్కా ప్రణాళికతో అవసరమైతే హత్య చేయడానికైనా వెనకాడ కూడదన్న ఉద్దేశంతో ముందుగానే తన ప్రణాలికను స్క్రిప్ట్ రూపంలో రాసుకుని దొంగతనానికి పాల్పడిన సంఘటన ప్రతి ఒక్కరికి ఆశ్చర్యం కలిగించేలా చేసింది. 14 ఏళ్ల బాలుడికి స్క్రిప్ట్ రాసుకుని దొంగతనం చేయాలనే ఆలోచన ఎక్కడి నుండి వచ్చింది అంటే ఇది క్రైమ్ సంబంధిత వీడియోల ప్రభావమే అని చెప్పాలి. అంతే తప్ప ఏ తల్లిదండ్రులు ఇలాంటి దారుణాలు చేయమని తమ పిల్లలకు చెప్పరు. మరి క్రైమ్ సంబంధించిన వీడియోలు యూట్యూబ్‌లో లభ్యమవుతున్నాయంటే తప్పు ఎవరిది అనే విషయంపై కూడా చర్చించాల్సిన అవసరం ఉంది. గతంలో క్రైమ్‌కి సంబంధించిన సినిమాలు కట్టడి చేయాలని విమర్శలు వెల్లువెత్తాయి. కానీ అందుకు సెన్సార్ బోర్డు చర్యలను సమర్థించుకుంటూ మానవ సమాజంలో నేరాలపై అవగాహన తీసుకురావడానికి మాత్రమే ఇలాంటి చిత్రాలు తయారు చేస్తున్నామని సమాధానమిచ్చారు. అంతేకాకుండా మంచి సినిమాలతో పాటు, క్రైమ్ సంబంధిత సినిమాలు కూడా చేస్తుంటే మరి మంచి సినిమాల ద్వారా ఎందుకు ప్రభావితం కావడంలేదన్న విషయాన్ని కూడా వారు ప్రస్తావించారు. ఏది ఏమైనా క్రైమ్ సంబంధిత వీడియోలు కట్టడి చేయడం ద్వారానే ఇలాంటి దుశ్చర్యల కట్టడి సాధ్యమనేది ముమ్మాటికీ నిజం. మొబైల్ ఫోన్ ఇప్పటి పిల్లల జీవితంలో భాగం అయిపోయింది. పెద్దలకు మాత్రమే కాకుండా పిల్లలు కూడా మొబైల్ ఫోన్‌కి వ్యసనపరులుగా మారుతున్నారు. ప్రస్తుతం భార్యాభర్తలిద్దరూ పని చేయనిదే ఇల్లు గడవని పరిస్థితి. ఈ హడావుడి బతుకుల్లో పిల్లలు ఏం చేస్తున్నారో పట్టించుకునే తీరిక, ఓపిక తల్లిదండ్రులకు ఉండట్లేదు. మరికొందరి తల్లిదండ్రులు తమ



పిల్లలకు స్మార్ట్‌ఫోన్లు మొదలు అడిగిందల్లా కొనిచ్చి అతి గారాబం చేస్తున్నారు. గత సంవత్సరం నంద్యాల జిల్లాలో తొమ్మిదేళ్ల బాలికపై ముగ్గురు అబ్బాయిలు అత్యాచారం చేసి, ఆపై ఆమెను హత్య చేశారు. ఇంటర్నెట్‌లో అశ్లీల వీడియోలు చూసే ఉత్సాహంలో తాము ఈ నేరానికి పాల్పడ్డామని వారు చెప్పారు. ఆడుతూ పాడుతూ చదువుకోవాల్సిన పిల్లల్లో దుష్ట ప్రవృత్తి ప్రబలంగా ఉందనేది అక్షర సత్యం, కానీ ఆ పాపం ఎవరిది తల్లిదండ్రులదే. ఎన్‌సీఆర్‌బీ లెక్కల ప్రకారం 2016లో దేశవ్యాప్తంగా ఆయా నేరాల్లో పట్టుబడిన మైనర్లు 32.5శాతం మంది ఉండగా 2022 నాటికి పట్టుబడిన మైనర్ల సంఖ్య దాదాపు యాభై శాతానికి పెరిగింది. ఒక్క ఢిల్లీలోనే హత్యలతో ప్రమేయం ఉన్న మైనర్ల సంఖ్య 2014-24 మధ్య 8. 7 శాతం నుంచి 26. 78 శాతానికి పెరిగిందంటే రాబోవు రోజుల్లో దేశ భవిష్యత్తు ఎలా ఉంటుందోనని ఆందోళన చెందాల్సిన పరిస్థితి. ఈ అంశాలపై విస్తృత చర్చ జరిగితేనే మార్పు కొంతమేరకు సాధ్యం అనే విషయాన్ని పాలకులు, తల్లిదండ్రులు, సభ్య సమాజం గమనించి అందుకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు ఉపక్రమించాలి.

# చౌటుప్పల్ లో ఘనంగా దుర్గాదేవి నిమజ్జనోత్సవం





**చౌటుప్పల్.అక్టోబర్ 04. ప్రభాత సూర్య:** చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని దొరవారి ఇంటిముందు కచ్చీరు వద్ద భవాని యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన భవాని దుర్గాదేవి శరన్నవరాత్రోస్తవాలను అత్యంత వైబోవపేతంగా నిర్వహించుకొని అమ్మవారి నిమజ్జన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ నిమజ్జన కార్యక్రమంలో కోబ్రా డాన్స్, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల శిగాలు, బోనాల ఆటలు, డోల్ల విన్యాసాలు, డప్పు వాయిద్యాలు మధ్య అమ్మవారు చౌటుప్పల్ పుర వీధుల గుండా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సుందర దృశ్యాన్ని ప్రజలు ఎంతో ఆసక్తితో తిలకించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం గౌడ్, భవాని యూత్ వ్యవస్థాపక అధ్యక్షులు వరగంటి రాజేందర్ గౌడ్, శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవాలయ అధ్యక్షులు బొబ్బిళ్ళ మురళి, నాయకులు గుజ్జుల సురేందర్ రెడ్డి, ఉడుగు మల్లేశం గౌడ్, ఉడుగు వెంకటేశం గౌడ్,అన్నమోని గోవిందరాజు,కాసుల వెంకటేశం గౌడ్,బొబ్బిళ్ళ సుభాష్, వరగంటి మహేందర్ గౌడ్, బిటెక్ నరేష్ గౌడ్, శివశంకర్ గౌడ్, కాసాని సాయి గౌడ్, పందుల వినోద్ గౌడ్, ఉత్తేజ్, వరుణ్ కుమార్ గౌడ్, శంకర్,వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణేశ్వరి నిత్య అన్నప్రసాద సేవ ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో

దుర్గామాతకు అభిషేకాలు



**సంస్థాన్ నారాయణపురం,అక్టోబర్ 04( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణేశ్వరి నిత్య అన్నప్రసాద సేవ ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగాయి. అనంతరం గ్రామ మహిళలచే ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు శంకరానంద స్వామీజీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.గ్రామ మహిళలు ప్రాచీన శివాలయం నుండి రామాలయం వరకు అనంతరం అన్నపూర్ణేశ్వరి ఆశ్రమంలో అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు గ్రామ ప్రజలు దుర్గామాత అభిషేకంలో పాల్గొని మొక్కలను తీర్చుకున్నారు.

## మంగాపూర్ లో ఘనంగా దుర్గాభవాని ఊరేగింపు మహోత్సవం





**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 4 :** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం మంగాపూర్ గ్రామంలో దుర్గాభవాని మాత కమిటీ ఆధ్వర్యంలో శనివారం దుర్గాభవాని ఊరేగింపు కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామ ప్రజల సమక్షంలో జరిగిన ఈ ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సంప్రదాయ పద్ధతుల మధ్య, మంగళ వాయిద్యాలు మోగుతుండగా భక్తులు "జై దుర్గాభవాని" నినాదాలతో మార్మోగించారు. పూలతో, గులాల తో ఊరేగింపు శోభాయమానంగా మారింది. మహిళలు మంగళహారతులు పట్టి, చిన్న పిల్లలు సాంప్రదాయ వేషధారణలో పాల్గొని తారసపడ్డ ప్రతి వీధిలో గ్రామ ప్రజలు పూల వర్షం కురిపించి మాతను సత్కరించారు. స్థానిక యువత, పెద్దలు, మహిళలు ఏకతాటిపైకి వచ్చి ఊరేగింపులో భాగమయ్యారు. దేవి మాత శోభాయాత్రలో పాల్గొనేందుకు పొరుగు గ్రామాల నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం గ్రామంలో దుర్గాభవాని ఊరేగింపును ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని, ఈ సంవత్సరం ఊరేగింపు గ్రామ ప్రజల సహకారంతో విజయవంతంగా జరిగిందని తెలిపారు. భక్తులంతా కలిసి సాంప్రదాయబద్ధంగా ఈ ఉత్సవాన్ని నిర్వహించడం మంగాపూర్ గ్రామం లో ప్రత్యేకతగా నిలిచింది. దేవి నామస్మరణతో, జయ జయధ్వానాలతో గ్రామమంతా మార్మోగిపోగా, వాతావరణం పూర్తిగా భక్తిరసమయంగా మారింది. ఊరేగింపులో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఆనందభరితులయ్యారు. ఈ కార్యక్రమంలో దుర్గ భవాని మాత కమిటీ సభ్యులు ప్రసాద్ గౌడ్, వీరేశం ముదిరాజ్, సతీష్ గౌడ్, లక్ష్మణ్ ముదిరాజ్, శ్రీధర్ ముదిరాజ్, రమేష్ ముదిరాజ్ ఎం.లక్ష్మణ్, నాని గౌడ్, ప్రశాంత్ గౌడ్,గౌతంముదిరాజ్, వంశీ ముదిరాజ్, సన్నీ ముదిరాజ్, నందు ముదిరాజ్, గౌతం, శ్రీరామ్, కన్ని గౌడ్, వేణు ముదిరాజ్ పాల్గొన్నారు.

# ఆపరేషన్ కొండాపూర్
# 3,600 కోట్ల స్థలాలకు రక్షణ

**హైదరాబాద్ :** హైదరాబాద్ మహానగరంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు, కబ్జాలకు గురైన భూములను రక్షించే ప్రక్రియను హైడ్రా విజయవంతంగా చేస్తోంది. హైడ్రా అధికారులు చేపడుతున్న కఠిన చర్యలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలంలోని కొండాపూర్‌లో ఏకంగా రూ.3,600 కోట్ల విలువైన 36 ఎకరాలను హైడ్రా అధికారులు రక్షించారు. ప్రభుత్వ భూమిని కాపాడేందుకు 'హైడ్రా' సంస్థ భారీ ఎత్తున కూల్చివేతల ఆపరేషన్ చేపట్టింది. ఈ కూల్చివేతలు కేవలం ప్రభుత్వ ఆస్తిని రక్షించడం మాత్రమే కాకుండా, భూ కబ్జాదారులకు బలమైన హెచ్చరికగా నిలిచాయి.ఆర్టీఏ కార్యాలయం పక్కనే ఉన్న భిక్షపతి నగర్ ఏరియాలో ఆపరేషన్ కొండాపూర్ హైడ్రా చేపట్టింది. సర్వే నంబర్ 59లో ఉన్న ఈ 36 ఎకరాల ప్రభుత్వ స్థలంలో కొంతమంది వ్యక్తులు ఆక్రమించారు. తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారు. వ్యాపార కార్యకలాపాలు చేపట్టారు. దీనిపై హైడ్రాకు అనేక ఫిర్యాదులు వచ్చారు. ఈ ఫిర్యాదులతో కదలిన అధికారులు చర్యలకు ఉపక్రమించారు. పకడ్బందీగా ఆక్రమణలు తొలగించారు. దీనిపై హైకోర్టులో కేసు నడుస్తోంది. అయితే ఈ విచారణలో భాగంగా ఆక్రమణలు తొలగించాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశాల మేరకు హైడ్రా సిబ్బంది ఈ ఆక్రమణల తొలగింపును అత్యంత పకడ్బందీగా చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు, ఆ ప్రాంతంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారుపూర్తి బందోబస్తుతో ఆపరేషన్ చేపట్టిన అధికారులు ఆ ప్రాంతంలోకి ఎవరినీ అనుమతించలేదు. దాదాపు రెండు కిలోమీటర్ల పరిధిలో కారిడార్లు ఏర్పాటు చేశారు. స్థానికులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్లను తొలగించారు. అది ప్రభుత్వ భూమి అని చెప్పే బోర్డులు ఏర్పాటు చేశారు. చుట్టూ కంచెను ఏర్పాటు చేశారు.



### రూ. 3,600 కోట్ల విలువైన భూమి కబ్జా వెనుక ఆంతర్యం

కొండాపూర్ ప్రాంతం హైదరాబాద్ నగరంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న, అత్యంత విలువైన స్థిరాస్తి మార్కెట్‌లలో ఒకటి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, సర్వే నంబర్ 59లోని ఈ 36 ఎకరాల ప్రభుత్వ భూమి విలువ దాదాపు రూ. 3,600 కోట్లు ఉంటుందని అంచనా. హైడ్రా చేపట్టిన ఈ ఆక్రమణల తొలగింపులో మరో కోణం వెలుగు చూసింది. తమ భూములు గత 60 ఏళ్లుగా తమ అధీనంలోనే ఉన్నాయని కొంతమంది రైతులు చెబుతున్నారు. భూమిని ఆక్రమించుకున్న కొందరు వ్యక్తులు, వ్యాపారం చేసుకుంటున్న వారు, తాత్కాలిక షెడ్లు వేసుకున్న వారు కాకుండా, ఈ భూమిపై తమకు హక్కు ఉందని రైతులు చెబుతున్నారు. అధికారులు హైకోర్టు తీర్పు మేరకు చర్యలు చేపట్టినప్పటికీ, రైతుల 60 ఏళ్ల అధీనంపై ఉన్న వాదన చట్టపరమైన సవాళ్లకు దారి తీసే అవకాశం ఉంది. అయితే, ఈ ఆక్రమణ తొలగింపు చర్య హైకోర్టు ఆదేశాల మేరకు జరగడంతో, ప్రభుత్వపరంగా పాలనాపరమైన చర్యలు వేగంగా పూర్తయ్యాయి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో భూ వివాదాల పరిష్కారం, ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇచ్చేందుకు హైడ్రాను పటిష్టం చేసింది. ఎన్ని వివాదాలు, సమస్యలు వచ్చినా ముందుకెళ్లేలా చర్యలు తీసుకున్నారు.

## దుర్గామాత పట్టుచీర రూ.4.75 లక్షలు

04గండిపేట01



గండిపేట : సూర్యా ప్రతినిధి మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాటేదాన్ పద్మశాలిపురం శ్రీ భూ లక్ష్మమ్మ దేవాలయంలో జై మాతాది యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 24వ దేవీ నవరాత్రి ఉత్సవాలను కన్నుల పండుగగా నిర్వహించారు. అమ్మవారి పట్టుచీరను రూ. 4.75 లక్షలకు కొండా కవితవెంకటేష్ దక్కించుకున్నారు. ఆ చీరని వారికి అందజేసి సన్మానించారు. అమ్మవారి కృప వారికి వారి కుటుంబ సభ్యులు అందరూ ఆయూరారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని కోరకుంటున్నారు.

## మునుగోడులో వైభవోపేతంగా దుర్గాదేవి నిమజ్జన శోభాయాత్ర

ఆకట్టుకున్న హనుమాన్,లక్ష్మీనరసింహ స్వామి వేషాలు

పంజాబీ బ్యాండ్ తో నృత్యాలు

పెద్ద సంఖ్యలో పాల్గొన్న ప్రజలు

పలు వీధుల్లో సాగిన శోభాయాత్ర యాత్ర



**మునుగోడు, అక్టోబర్ 04(ప్రభాత సూర్య) :** మునుగోడు మండల కేంద్రంలోని శ్రీ శివరామ ఆలయములో దసరా దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు..శుక్రవారం అమ్మవారి నిమజ్జన శోభాయాత్ర కనుల పండుగగా సాగింది.ఆలయములో ఆలయ ప్రధాన అర్చకులు కొండోజు నవీన్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించి శోభాయాత్ర ప్రారంభించారు..తెలంగాణ సినిమా జానపద కళాకారులు సంఘం వారు ప్రదర్శించిన హనుమాన్, ఒక,వినాయకుడు, గొరిల్లా, కింగ్ కాంగ్ గెటాప్స్.పంజాబ్ బ్యాండ్ నృత్యాలు ఆకట్టుకున్నాయు. శోభాయాత్రలో పాల్వాయి చెన్నారెడ్డి, పాలకూరీ నరసింహ, నారబోయిన రవి ముదిరాజు, బిసం విజయ్ లు పాల్గొన్నారు.. గెటప్పులతో ఫొటోస్ దిగడానికి పోటీపడ్డారు.. పలు వీధులలో వైభవంగా కొనసాగింది.మండల బీసీ.శ్రీరామోజు వెంకటేశ్వర్లు గిరిధర్ శ్రీనివాస్ పెరుమాల్ల ప్రమోద్ కుమార్,నర్సింహ గౌడ్ గౌడ్, విష్ణు, పి రాజీవ్, వంశీ, మధు, అర్చకులు కొండోజు నవీన్ కుమార్ శిష్య బృందం, శ్రీరామోజీ మహేష్ బొల్లోజు శ్రీకాంత్ చారి తిరందాసు ప్రవీణ్ కుమార్ గ్రామస్థులు పాల్గొన్నారు..

## ఆమెరికా గన్ కల్చర్‌కు హైదరాబాద్‌కు చెందిన విద్యార్థి బలి

**హైదరాబాద్ :** ఆమెరికాలో పెరిగిపోతున్న గన్ కల్చర్ మరో అమాయకుడిని బలి తీసుకుంది. డల్లాస్‌లో నగరంలో ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో హైదరాబాద్‌కు చెందిన ఓ విద్యార్థి మృతి చెందాడు. ఎల్బీ నగర్ పరిధిలోని బిఎన్ రెడ్డి నగర్‌కు చెందిన పోలే చంద్రశేఖర్ 2023లో బిడిఎస్ పూర్తి చేసి.. ఆ తర్వాత ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లాడు. అయితే నేటి తెల్లవారుజామున దుండగుడి కాల్పుల్లో అతను కన్నుమూశాడు. కాల్పులకు పాల్పడింది ఓ నల్ల జాతీయుడని సమాచారం. ఈ ఘటనపై భారత రాయబార కార్యాలయం స్పందించాల్సి ఉంది.

## రేవంత్ రెడ్డి పక్కా దొంగనే.. నిప్పులు చెరిగిన హైడ్రా బాధితులు

**హైదరాబాద్ :** హైదరాబాద్ వాసులకు హైడ్రా కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా.. అర్ధరాత్రి వేళ బస్తీలపై హైడ్రా బుల్డోజర్లు విరుచుకు పడుతున్నాయి. నిరుపేదల గుడిసెలను, రేకుల ఇండ్లను నేలమట్టం చేస్తూ.. వారి కడుపును కొడుతున్నారు హైడ్రా అధికారులు. మొన్న బతుకమ్మ పండుగ మొదటి రోజే గాజుల రామారంలో కూల్చివేతలు చేపట్టి పేదలకు నిలువ నీడ లేకుండా చేసిన హైడ్రా సిబ్బంది.. నేడు దసరా పండుగ తెల్లారే కొండాపూర్‌లో నిరుపేదలకు చెందిన పలు నిర్మాణాలను తొలగించారు.కొండాపూర్‌లోని బిక్షపతి నగర్‌లో ఉన్న ప్రభుత్వ స్థలంలోని అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. శనివారం తెల్లవారుజామునే బుల్డోజర్లు, ప్రొక్లైనర్లతో వచ్చిన అధికారులు భారీ పోలీసు బందోబస్తు నడుమ కూల్చివేతలు చేపట్టారు.ఈ సందర్భంగా బాధిత మహిళలు సీఎం రేవంత్ రెడ్డితో పాటు హైడ్రా అధికారులపై నిప్పులు చెరిగారు. రేవంత్ రెడ్డి దొంగ కాబట్టే చీకట్ల వచ్చి ఇండ్లు కూలగొట్టిండు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరా గాంధీ ఇచ్చిన భూములు కాంగ్రెస్ ప్రభుత్వమే లాక్కుంటుంది. రేవంత్ రెడ్డి పక్కా దొంగ కాబట్టే.. తెల్లవారుజామున 4 గంటలకు మా ఇండ్లపైకి హైడ్రా బుల్డోజర్లను పంపించాడని ధ్వజమెత్తారు.చివరకు రేవంత్ రెడ్డి మెడలో చెప్పుల దండలు వేస్తాము అని మహిళలు మండిపడ్డారు. ఈ భూమి అప్పట్లో ఫ్యామిలీ ప్లానింగ్ చేసుకుంటే ఇందిరా గాంధీ ఇచ్చింది. ఇప్పుడు రేవంత్ రెడ్డి లాక్కుంటున్నాడు అని మహిళలు కన్నీరు పెట్టుకున్నారు.

## రేవంత్ రెడ్డికి దమ్ముంటే సెక్యూరిటీ లేకుండా రమ్మను...

### కొండాపూర్‌లోని భిక్షపతి నగర్‌లో పేదల ఆక్రందన

**హైదరాబాద్ :** సీఎం రేవంత్ రెడ్డిపై మహిళలు నిప్పులు చెరుగుతున్నారు. ఇందిరా గాంధీ భూములిస్తే.. రేవంత్ రెడ్డి లాక్కుంటున్నాడని మండిపడ్డారు. కొండాపూర్‌లోని భిక్షపతి నగర్‌లో పేదలకు సంబంధించిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేయడంతో.. రేవంత్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.భూముల దందా చేసుకుని బతికే దొంగ రేవంత్ రెడ్డి అంటూ ఓ మహిళ మండిపడింది. రేవంత్ రెడ్డి సెక్యూరిటీ లేకుండ వస్తే ఇక్కడనే పండబెట్టి తొక్కుతం అని హెచ్చరించింది. కేసీఆర్ మా చెలకల జోలికి ఎన్నడు రాలేదు అని మరో మహిళ పేర్కొంది. తులం బంగారం లేదు.. 2500 ఇవ్వలేదు.. పెన్షన్లు లేవు.. కరెంట్ బిల్లులు మాఫీ కాలేదు కానీ.. మా భూముల మీద రేవంత్ రెడ్డి పడిండు అని మరో మహిళ ధ్వజమెత్తింది.మరో వృద్ధురాలు మాట్లాడుతూ.. మా నాన్న పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకుంటే ఇందిరా గాంధీ మాకు ఈ భూములు ఇచ్చిందని తెలిపింది. అప్పటి నుండి మమ్మల్ని ఎవరూ ఏం అనలేదు. రేవంత్ రెడ్డి వచ్చి మా భూముల మీద పడ్డాడు. హైడ్రా కూల్చివేతల్లో ఇల్లు పోగొట్టుకున్నానని ఓ వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది.

## పొన్నంపై అంజన్ ఆగ్రహం

**హైదరాబాద్ :** తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై సొంత పార్టీ నేత, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో టిక్కెట్ కోసం కాంగ్రెస్ పార్టీలో నాయకుల మధ్య విభేదాలు వెలుగుచూస్తున్నాయి. జూబ్లీహిల్స్ టిక్కెట్ కోసం అంజన్ కుమార్ యాదవ్ ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు, హైదరాబాద్ ఇన్‌ఛార్జ్ మంత్రిగా పొన్నం ప్రభాకర్ ఉన్నారు.ఉప ఎన్నికల్లో స్థానికులకు అవకాశం ఉంటుందని, బయటి నుంచి దిగుమతి ఉండదని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలపై అంజన్ కుమార్ యాదవ్ స్పందించారు.

# ఆర్ఆర్ఆర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని

**భూములను కోల్పోతున్న రైతులకు**
**భూమికి బదులు భూమి ఇవ్వాలి**
**సిపిఎం ఆధ్వర్యంలో 'హెచ్ఎండీఏ' ఆఫీస్ ముందు**
**నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయండి**
**సిపిఎం రాష్ట్ర మిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా**





**భువనగిరి, అక్టోబర్ 04( ప్రభాత సూర్య):** రీజనల్ రింగ్ రోడ్డులో (ఆర్ఆర్ఆర్) భూములు కోల్పోతున్న నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని, ఆలైన్మెంట్ ను మార్చాలని, భూములు కోల్పోతున్న రైతులకు భూమికి బదులు భూమి ఇవ్వాలని ఈ నెల 6న సిపిఎం ఆధ్వర్యంలో హైదరాబాదులోని హెచ్ఎండీఏ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న "ధర్నా" లో నిర్వాసితులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా పిలుపునిచ్చారు. శనివారం భువనగిరి మండల పరిధిలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో రీజనల్ రింగ్ రోడ్ లో భూములు కోల్పోతున్న రైతులతో కలిసి భూములను సిపిఎం ఆధ్వర్యంలో పరిశీలన చేయడం జరిగింది. ఈ సందర్భంగా నర్సింహ పాల్గొని మాట్లాడుతూ రైతులతో మాట్లాడకుండా, గ్రామ సభలు నిర్వహించకుండా, భూమి సేకరణలో స్పష్టతనివ్వకుండా బలవంతంగా భూములను తీసుకోవాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తే రైతుల నుండి తీవ్రమైన ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో బస్వాపురం ప్రాజెక్టు, కాలువలకు, రోడ్లకు పెద్ద ఎత్తున రైతులు భూములు కోల్పోయారని అన్నారు. రీజనల్ రింగ్ రోడ్డు ఒక రింగ్ రోడ్డు నుంచి ఇంకో రింగ్ రోడ్డు మధ్యన 40 కిలోమీటర్ల పరిధి ఉండాలని ఉన్న ఎందుకు దానిని అమలు చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంత్రుల, ఎమ్మెల్యేల, పెట్టుబడిదారుల, రియల్ ఎస్టేట్ వ్యాపారుల భూములు కాపాడడానికి అలైన్మెంట్ మార్చారని విమర్శించారు. 100 మీటర్ల వెడల్పుతో రోడ్డును నిర్మించాలని హెచ్ఎండీఏ నోటిఫికేషన్ ఇచ్చిందని, రైల్వే ట్రాక్ కోసం మరొక 40 అడుగుల వెడల్పుతో రోడ్డును పెంచుతామని ప్రభుత్వం చెబుతున్నదని తెలిపారు. ఇంతకు ముందు మొదటి అలైన్ మెంట్ తయారుచేశారనీ, తర్వాత దాన్ని మార్చి రెండోసారి ఆలైన్మెంట్, ఇప్పుడు మూడో అలైన్మెంట్ను తయారుచేసి విడుదల చేశారని ఇందులో రాజకీయ అండదండలు, డబ్బు, పలుకుబడి ఉన్న వారి భూముల జోలికి వెళ్లకుండా ఎకరం , రెండు, మూడెకరాలున్న చిన్న, సన్నకారు రైతులకు సంబంధించిన భూములున్న ప్రాంతాన్నే రింగ్ రోడ్డు కోసం తీసుకుంటున్నట్లుగా పెద్దఎత్తున ఆరోపణలొస్తున్నాయని గుర్తు చేశారు. ఇప్పటికైనా 2013 చట్టం ప్రకారం గ్రామ సభలు పెట్టాలని, భూమికి భూమి ఇవ్వాలనీ, మార్కెట్ రేటుకు మూడింతలు అదనంగా చెల్లించాలనే డిమాండ్స్ తో ఈనెల 6వ తేదీన నిర్వహిస్తున్న "ధర్నా" లో రైతులు, వ్యవసాయ కూలీలు, వృత్తిదారులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని నర్సింహ కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గడ్డం వెంకటేష్ , మండల కార్యదర్శివర్గ సభ్యులు కొండ అశోక్, గ్రామ శాఖ కార్యదర్శి కూకుట్ల కృష్ణ , రైతులు కొండ పెద్ద వెంకటేష్, జక్కుల మల్లెశ్ , కొండ రమేష్, బబ్బురి రాజు, మాకోళ్ల మాకోళ్ల నర్సింహ, రాంపల్లి చంద్రయ్య, కొండ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# గట్టుప్పల్‌లో ఈఎల్.వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.



**గట్టుప్పల్ ప్రభాత సూర్య.వార్త 4** గట్టుప్పల్ మండల కేంద్రంలో ఈ ఎల్వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి వేలాదిమంది సభ ప్రాంగణానికి తరలివచ్చి పాల్గొన్నారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, భువనగిరి పార్లమెంట్ సభ్యులు , బీఆర్ ఎస్ నాయకులు క్యామ మల్లేష్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ు "సమాజ సేవలో ఎల్లప్పుడూ ముందుండే ఈఎల్వి ఫౌండేషన్ అధినేత డాక్టర్ భాస్కర్ అభినందనీయుడు. సమాజ అభ్యున్నతి కోసం ఎల్లవేళలా ఫౌండేషన్ అండగా ఉండాలి" అని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఈ. ఎల్.వి ఫౌండేషన్ అధినేత డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ ు "విద్య, వైద్యం, ఉద్యోగం ప్రధాన లక్ష్యాలుగా ఈ.ఎల్.వి ఫౌండేషన్ ముందుకు సాగుతుంది. ఎవరికైనా ఆపద వచ్చినా ఫౌండేషన్ అండగా నిలుస్తుంది" అని హామీ ఇచ్చారు. ఉత్సవాలను మరింత ఆకర్షణీయంగా మార్చినవారు సినీ, టీవీ రంగానికి చెందిన కళాకారులు. దర్శకుడు పూరి జగన్నాథ్ కుమారుడు, హీరో ఆకాష్ జగన్నాథ్, నటుడు ధనరాజ్, జోర్దార్ సుజాత, బుల్లెట్ బండి లక్ష్మణ్, రామ్, సింగర్ శ్రీనిధి తదితరులు హాజరయ్యారు. వీరి ప్రదర్శనలు, పాటలు సభ ప్రాంగణాన్ని. ఉత్సాహభరితంగా మార్చి ప్రజలను ఆకట్టుకున్నాయి. అదేవిధంగా జిల్లాలోని వివిధ కళాకారులను గుర్తించి సన్మాన కార్యక్రమం కూడా నిర్వహించారు. భాస్కర్ చేతుల మీదుగా కళాకారులకు మెమెంటోలు అందజేయగా, కళాకారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ దసరా ఉత్సవాలు రాజకీయాలకు అతీతంగా విజయవంతంగా జరిగి, గట్టుప్పల్ మండల నాయకులు, పెద్దలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విశేషంగా నిలిచాయి.

# 6న హెచ్ఎండిఏ కార్యాలయం ముందు త్రిబుల్ ఆర్ భూ నిర్వాసితుల ధర్నాను జయప్రదం చేయాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండ శ్రీశైలం**



**గట్టుప్పల్ ప్రభాతసూర్య 4** గట్టుప్పల్ మండల పరిధిలోని గట్టుపల, తెరటుపల్లి, నామాపురం, వెల్మకన్నె గ్రామాల రైతులు వందల ఎకరాల పట్టా భూములు కోల్పోతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండ శ్రీశైలం అన్నారు. ప్రధానంగా సన్నకారు, చిన్నకారు రైతులే నిర్వాసితులవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ముందుగా ప్రకటించిన 1, 2 అలైన్మెంట్లను పక్కనబెట్టి, రైతులకు సమాచారం ఇవ్వకుండా మూడో అలైన్మెంట్ రూపొందించడం అన్యాయం అన్నారు. సంపన్న వర్గాలను కాపాడేందుకే ఈ మార్పు చేయబడిందని, దీని వల్ల పేద రైతులు, భూములు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని విమర్శించారు. సారవంతమైన పంట భూములు నష్టపోవడం వందల కుటుంబాలను భూమిలేని నిరుపేదలుగా మారుస్తుందని తెలిపారు. గత బిఆర్ఎస్ హయాంలో ప్రకటించిన అలైన్మెంట్లను ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ విమర్శించి, అధికారంలోకి వచ్చిన తర్వాత మార్చుతామని ఇచ్చిన హామీని విస్మరించిందని ఆయన మండిపడ్డారు. ఈనెల 6న హెచ్ఎండిఏ కార్యాలయం ముందు జరగనున్న త్రిబుల్ ఆర్ భూ నిర్వాసితుల ధర్నాకు అధిక సంఖ్యలో రైతులు, నిర్వాసితులు హాజరై జయప్రదం చేయాలని బండ శ్రీశైలం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చాపల మారయ్య, కర్నాటి మల్లేశం, మండల కమిటీ సభ్యులు కర్నాటి సుధాకర్, కర్నాటి వెంకటేశం, అచ్చిన శ్రీనివాస్, వల్లూరి శ్రీశైలం, పెద్దగాని నరసింహ, ఖమ్మం రాములమ్మ, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎం అభ్యర్థులను గెలిపించండి

**-సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి**

**చౌటుప్పల్.అక్టోబర్ 04.ప్రభాత సూర్య:** రానున్న ఎన్నికల్లో సర్పంచ్, ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల్లో పోటీ చేసిన సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కందాల రంగారెడ్డి స్మారక భవనం లో చౌటుప్పల సిపిఎం మండల జనరల్ బాడీ సమావేశం మండల కార్యదర్శివర్గ సభ్యులుతడక మోహన్ అధ్యక్షతన నిర్వహించిన నిర్వహించినఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కృష్ణారెడ్డి పాల్గొని మాట్లాడుతూ... ఇప్పటివరకు ప్రజాప్రతినిధులుగా సిపిఎం ప్రాతినిథ్యం వహించిన గ్రామాలలో, మండలాలలో ఎలాంటి అవినీతికి తావులేకుండా గ్రామాల, మండలాల సమగ్రాభివృద్దే ధ్యేయంగా పనిచేశారని అన్నారు. నిరంతరం గ్రామాల్లో ఉన్న రైతులు, వ్యవసాయ కూలీలు, వృత్తిదారులు, కార్మికుల పక్షాన వారి సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలలో ముందుండి పని చేశారని తెలిపారు. జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు డబ్బుకు, మద్యం, అమలుకాని హామీలకు మోసపోకుండా నిరంతరం ప్రజల సమస్యలే ఎజెండాగా పని చేస్తున్న సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశానికి సిపిఎం మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, జిల్లా కమిటీ సభ్యులు రాగిరికిష్టయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు చింతల సుదర్శన్, బోయ యాదయ్య, మండల కమిటీ సభ్యులు అంతటి అశోక్, ఆదిమూలం నందీశ్వర్, పొట్ట శ్రీను, పల్లె మధు కృష్ణ, కొండే శ్రీశైలం, జక్కిడి దేవేందర్ రెడ్డి, చెరుకు లక్ష్మమ్మ, నాయకులు కందాల రవీందర్ రెడ్డి, జక్కిడి రాంరెడ్డిశాఖ, కార్యదర్శిలు కొంతం శ్రీనివాస్ రెడ్డి, కాసం వెంకటేశం, రత్నం శ్రీకాంత్, నేరడి మహేష్, కడగంచిరాజు, పల్లె జంగయ్య, బాలగోని బాలరాజు,పల్సం శంకరయ్య, మాజీ ఎంపీటీసీలు బత్తుల శంకర్,బద్దం అంజయ్య, మానే సాలయ్య,మారగోని మారయ్య,పగిళ్ల శశిరేఖ, యాట ముత్యాలు, మదారి కాసం,జంగయ్య, పక్కీరు పెంటా రెడ్డి, తగరం ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.




## ఎంపిటిసి టికెట్ ఏదునూరి వీరన్నకు ఇవ్వాలని తాటికొండ రాజయ్యను కోరిన గోపి రజక

?? స్థానిక సంస్థల ఎన్నికల్లో రజకులు పోటీ చేయాలన్న ముత్యాల నర్సింగరావు



**ఘనపూర్, అక్టోబర్ 04( ప్రభాత సూర్య):** రజక కులస్తులు రాజకీయంగా సామాజికంగా ఆర్థికంగా ఎదగాలని ముఖ్యంగా రాజకీయంగా ఎదగాలని రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్యాల నర్సింగరావు ఆకాంక్షించారు. రాజకీయమే అంతిమ లక్ష్యంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రజకులు పోటీ చేయాలని జిల్లా అధ్యక్షులు ఏదునూరి నరేష్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర తొలి ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య ని స్టేషన్ ఘనపూర్ తన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి స్థానిక సంస్థల ఎన్నికల్లో లింగాల ఘనపూర్ మండలం నుంచి టీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షులు , తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏదునూరి వీరన్న కి లింగాల ఘనపూర్ నుంచి బీఆర్ఎస్ పార్టీ ఎంపిటిసి టికెట్ ఇవ్వాలని రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక కోరారు. బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షులు నేరెళ్ళ విజయ్ కుమార్,తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి కాసర్ల యాకలక్ష్మి , నేషనల్ హ్యూమన్ రైట్స్ హన్మకొండ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బండి సదానందం, జిల్లా నాయకులు మంతెన ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వీల్ చైర్ లో కూర్చునే తండ్రికి తలకోరివి

గుండెల్ని పిండేసిన విషాదకరమైన ఘటన
నిరుపేద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం
మానవత్వాన్ని చాటుకున్న కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు వద్దే వెంకటేష్



**మర్రిగూడ ప్రభాత సూర్య 4** రామ్ రెడ్డి పల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన పగిళ్ల నరసింహ అనారోగ్యంతో మృతి చెందారు. నరసింహ మానసిక వికలాంగుడైన తన కుమారుడిని వీల్‌చేరులో చూసుకుంటూ జీవనం సాగించేవారు. తండ్రి మరణంతో ఆ కుమారుడు వీల్‌చేరులో కూర్చుని తండ్రికి తలకొరివిని పెట్టడం చూసిన ప్రతి ఒక్కరి హృదయాన్ని మెలిపెట్టింది. ఈ దయనీయ పరిస్థితిని గమనించిన స్థానిక కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు వద్దే వెంకటేష్ మానవత్వాన్ని చాటుతూ అంత్యక్రియల కోసం రూ.5,000/- ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో తండ్రి మరణంతో మానసిక వికలాంగుడైన కుమారుడు అనాథగా మిగిలిపోవడం పట్ల ప్రజలు కంటతడి పెట్టారు. ఈ కార్యక్రమంలో రావుల రాములు, కారింగు నరసింహ, వద్దె ముత్యాలు, ఐతగోని ఉపేందర్, ఐతగోని సురేష్, కుందారపు సత్యం, పగిళ్ల వంశీ తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుంట్ల గ్రామానికి ఉచిత బస్సు అవసరము లేదా!

గ్రామ అభివృద్ధి పట్ల పాలకుల నిర్లక్ష్య వైఖరి సరైనది కాదు.
ఐత విజయ్ - డివైఎఫ్ఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి.



**గట్టుపల్ :ప్రభాత సూర్య4** కల్వకుంట్లగ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని, ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని, డివైఎఫ్ఐ,ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈరోజు స్థానికంగా ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి ఐత విజయ్ మాట్లాడుతూ 77 ఏండ్ల స్వతంత్ర భారతంలో గ్రామాలకు బస్సు సౌకర్యం, సరైనటువంటి రవాణా సౌకర్యం లేకపోవడం చాలా సిగ్గుచేటు అన్నారు. గ్రామానికి బస్సు సౌకర్యం కావాలని అనేక సార్లు, అనేక దపాలుగా అధికారులకు విన్నవించిన, ధర్నాలు మరియు రాస్తారోకోలు చేసిన ఏమాత్రం కూడా పాలకులు, అధికారులు స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్టుగా, ఈ గ్రామం పట్ల ప్రజా ప్రతినిధులు చవితి తల్లి ప్రేమను ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. అనేకమంది విద్యార్థులు పై చదువుల కొరకు నిత్యము ప్రతి రోజు 50 నుంచి 100 మంది విద్యార్థులు ప్రయాణం చేస్తుంటే స్థానిక నాయకులకు కొంచెం కూడా చీమకుంటిదంతా బాధ కూడా వారికి లేదని అన్నారు. ఎవరు ఎటు పోతే మాకు ఏమి అన్నట్టుగా మా ప్రయోజనాలే మాకు ముఖ్యం అన్నట్టుగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని ప్రాథమిక పాఠశాలను నిర్మించి సుమారు 30 సంవత్సరాల అవుతున్నప్పటికీ ఇప్పటికీ కూడా ప్రహరీ గోడ లేకపోవడం పేద విద్యార్థుల పట్ల ఈ పాలకులు, ప్రభుత్వాల కుట్రేనని కనీసము విద్యార్థులు చదువుకోవడానికి, కూర్చోవడానికి బెంచీలు సైతం లేకపోవడం చాలా సిగ్గుచేటు అన్నారు. కల్వకుంట నుండి వెలమకన్నె గ్రామానికి మంజూరైన రోడ్డును ప్రారంభించి మధ్యలోనే అసంపూర్తిగా వదిలేశారని దాన్ని తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గతంలో స్థానిక ఎమ్మెల్యే గారు ఈ గ్రామాన్ని దత్తత తీసుకుంటానని చెప్పి అప్పుడు మా పార్టీ అధికారంలో లేదని అందుకే నేను అభివృద్ధి చేయలేకపోయాను అని మాయమాటలు చెప్పి మళ్ళీ ఎలక్షన్లో గెలిచిన తర్వాత గ్రామం వైపు కన్నెత్తి చూడకపోవడం సిగ్గుచేటు అన్నారు. స్థానికంగా ఉండే నాయకులు తమకు తమ వ్యక్తిగత ప్రయోజనాల మీద మరియు తమ పదవుల మీద ఉన్నటువంటి సోయి గ్రామ అభివృద్ధి మీద లేకపోవడం చాలా విడ్డూరం అన్నారు. ఇప్పటికైనా పాలకులు అధికారులు స్పందించాలని, గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. లేనిపక్షంలో గ్రామ అభివృద్ధి కోసం మరిన్ని పోరాటాలకు యువత నడుంబిస్తుందని అన్ని విధాలుగా గ్రామాన్ని అభివృద్ధి దూరం చేస్తున్న నాయకులను స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి,సిఐటియు మండల కన్వీనర్ వరికుప్పల ముత్యాలు, ప్రజాసంఘాల నాయకులు పగిళ్ల మధు, కుక్కల బాలస్వామి, పగిళ్ళ యాదయ్య, డివైఎఫ్ఐ నాయకులు కట్ట ఆంజనేయులు,బొందు శివ,కుక్కల మహేష్, చేకూరి ప్రేమ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

### తగ్గినట్లే తగ్గి మళ్లీ చురకలు అంటిస్తున్న బంగారం ధరలు



ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా మహిళలు బంగారు అభరణాలు ధరిస్తారు. ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాల్లోని మహిళలందరూ బంగారానికి ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తారు. అనేక రకాల డిజైన్లతో లక్షల్లో విలువ చేసే కమ్మలు, నెక్లెస్లు, బ్యాంగిల్స్ వంటివి కొనుగోలు చేస్తుంటారు. ఆడవాళ్లకు ప్రతిరోజూ షాపింగ్ చేసిన బోర్ కొట్టదనడంలో ఎటువంటి సందేహం లేదని చెప్పవచ్చు. కాగా గోల్డ్ రేట్లు ఎప్పుడెప్పుడు తగ్గుతాయా? అంటూ మహిళలు వేయి కళ్లతో ఎదురుచూస్తుంటారు. కాస్త పసిడి ధరలు తగ్గుముఖం పట్టగానే బంగారం షాపుల్లో ఎగబడుతారు. అయితే ఇటీవల బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ రేట్లతో మహిళల్లో ఓసారి ఉత్సాహం నెలకొనగా... మరోసారి నిరాశకు గురవుతుంటారు. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో బంగారం రేట్లు భారీగా పెరుగుతున్నాయి. కొంచెం తగ్గగానే డబుల్, త్రిబుల్ ధర పెరుగుతుంది. ఇవాళ గోల్డ్ ప్రియులకు భారీ షాక్ తగిలింది. నిన్న 22 క్యారెట్లు.. 10 గ్రాముల బంగారం రూ. 1,08, 650 ఉండగా.. నేడు రూ. 800 పెరిగి రూ. 1, 09, 450గా ఉంది. ఇక నిన్న 24 క్యారెట్లు 10 గ్రాముల బంగారం ధర రూ. 1,18, 530 గా ఉంది. నేడు రూ. 870 పెరిగి రూ. 1, 19, 400 గా ఉంది. కాగా ఈ నేపథ్యంలో నిన్నటి ధరతో పోలిస్తే ఇవాళ పసిడి ధరల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి.

### వాట్సాప్‌ను మించిన ఫీచర్స్‌తో స్వదేశీ యాప్ అరట్టై




వాట్సాప్ ప్రతిఒక్కరి ఫోన్లలో ఖచ్చితంగా ఉండే యాప్. మెసేజింగ్ యాప్స్ లో ప్రస్తుతం నంబర్ వన్ స్థానంలో ఉంది. దీనికి పోటీగా చాలా యాప్స్ వచ్చాయి కానీ నిలబడలేక పోయాయి. కాగా ఇప్పుడు వాట్సాప్‌ను బీట్ చేసేందుకు దేశీయ కంపెనీ జోహోకు చెందిన అరట్టై మెసేజింగ్ యాప్ వచ్చింది. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్ లాంటి వ్యక్తి స్వయంగా ప్రమోట్ చేయడంతో అరట్టై పేరు వార్తల్లో నిలుస్తోంది. ఇప్పటికే దీనిని ప్లే స్టోర్ లో 50 లక్షలకు పైగా మంది డౌన్ లోడ్ చేసుకున్నారు. ఫీచర్స్ లోనూ వాట్సాప్ కు మించి ఇందులో ఉండటంతో చాలా మందిని అరట్టై ఆకర్షిస్తోంది. అరట్టైలో మీటింగ్స్ పెట్టుకోవచ్చు. ఈ ఆప్షన్ వాట్సాప్ లోనూ ఉంది. కానీ అరట్టైలో పూర్తైన మీటింగ్స్ సమాచారం కూడా సేవ్ అవుతుంది. అదే విధంగా ఇందులో మీడింగ్స్ ముందే షెడ్యూల్ చేసుకోవచ్చు. వాట్సాప్ గ్రూపుల్లో ట్యాగ్ చేస్తే ఆ గ్రూప్ ఓపెన్ చేసి చూడాలి. కానీ అరట్టై లో మిమ్మల్ని ట్యాగ్ చేస్తూ చేసిన సందేశాలన్నీ ఒకేదగ్గర ఉంటాయి. కాబట్టి ప్రతి గ్రూప్ ఓపెన్ చేయాల్సిన అవసరం ఉండదు. వాట్సాప్ లో సేఫ్టీ ఉన్నప్పటికీ యూజర్ల డేటాను టార్గెట్ అడ్వర్టైజింగ్ కు వినియోగించుకుంటుంది. కానీ అరట్టై అలా డేటాను వినియోగించుకోదు. వాట్సాప్ లో మెటా ఏఐ సేవలు అందుబాటులో ఉన్నాయి. దాని వల్ల ఏఐ ఇంటరాక్షన్ కారణంగా ఇబ్బంది కలుగుతుంది. కానీ అరట్టై లో ఏఐ లేకపోవడం వల్ల యాప్ సింపుల్ గా, యూజర్ ఫ్రెండ్లీగా ఉండే అవకాశం ఉంది.

# మ్యూచువల్ ఫండ్స్‌లో మరో 12 కొత్త పథకాలు



ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో మరో 12 కొత్త ఫండ్స్ అందుబాటులోకి వస్తున్నాయి. వాటితో పాటుగా 3 స్ట్రాటజిక్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (ఎస్ఎఫ్ఐ)లు సైతం ఉన్నాయి. ఇప్పటికే పలు స్కీమ్స్ సబ్‌స్క్రిప్షన్ మొదలైంది. తమ కంపెనీ పోర్ట్‌ఫోలియోలో ఉన్న గ్యాప్స్ పూరించేందుకు కొత్త స్కీమ్స్ లాంచ్ చేస్తున్నట్లు మ్యూచువల్ ఫండ్ కంపెనీలు ప్రకటించాయి. న్యూ ఫండ్ ఆఫర్ ద్వారా మార్కెట్లకు కొత్త తరం ఫండ్స్ తీసుకొస్తున్నట్లు పేర్కొన్నాయి. మరి ఏ స్కీమ్ ఎప్పుడు వస్తుంది? క్వాసిఫ్ హైబ్రిడ్ లాంగ్ షార్ట్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఇప్పటికే మొదలైంది. అక్టోబర్ 9వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఇక అల్టివా హైబ్రిడ్ లాంగ్ షార్ట్ ఫండ్, మ్యాగ్నమ్ హైబ్రిడ్ లాంగ్ షార్ట్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ అక్టోబర్ 15వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. కోటక్ నిఫ్టీ 200 మూమెంటమ్ 30 ఈటీఎఫ్, డీఎస్‌పీ నిఫ్టీ 500 ఫ్లెక్సీ క్యాప్ క్విలిటీ 30 ఈటీఎఫ్ స్కీమ్స్ సబ్‌స్క్రిప్షన్ అక్టోబర్ 6వ తేదీతో ముగుస్తోంది. జిరోధా నిఫ్టీ 50 ఈటీఎఫ్ సబ్‌స్క్రిప్షన్ 10వ తేదీతో ముగుస్తుంది. వాటితో పాటుగా జియో బ్లాక్ రాక్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్, ద వెల్త్ కంపెనీ ఫ్లెక్సీ క్యాప్ పండ్ సబ్‌స్క్రిప్షన్స్ వరుసగా అక్టోబర్ 7వ తేదీ, అక్టోబర్ 8వ తేదీల్లో ముగుస్తున్నాయి. సెక్టోరల్ ఫండ్ కేటగిరీలో మోతీలాల్ ఓస్వాల్ కన్సంప్షన్ ఫండ్, ఇన్వెస్కో ఇండియా కన్సంప్షన్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ అక్టోబర్ 15, 17వ తేదీల్లో ముగుస్తున్నాయి. ద వెల్త్ కంపెనీ ఎథికల్ ఫండ్, ఐసీఐసీఐ ప్రూ కాంగ్లమరేట్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ అక్టోబర్ 9, 17 తేదీల్లో ముగుస్తున్నాయి. ద వెల్త్ కంపెనీ ఆర్బిట్రేజ్ ఫండ్, ద వెల్త్ కంపెనీ లిక్విడ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ అక్టోబర్ 8వ తేదీన ముగుస్తుంది. జిరోధా నిఫ్టీ 50 ఇండెక్స్ పండ్ సబ్‌స్క్రిప్షన్ అక్టోబర్ 10వ తేదీతో ముగుస్తుంది. ఈ ఫండ్ హౌస్ అందిస్తోన్న ఏకైక డైరెక్ట్ ప్లాన్ ఇదే. మ్యూచువల్ ఫండ్స్‌లోనూ హైరిస్క్ ఉంటుంది. ఈ కథనం కేవలం సమాచారం అందించేందుకే. కానీ, ఎలాంటి పెట్టుబడులను ప్రోత్సహించడం లేదు. అలాగే కొత్తగా మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలనుకునే వారు న్యూ ఫండ్ ఆఫర్‌కి దూరంగా ఉండాలని మార్కెట్ నిపుణులు సూచిస్తుంటారు. సరైన అవగాహన లేకుండా పెట్టుబడులు పెడితే నష్టపోవచ్చు. గతంలో వచ్చిన రాబడులు భవిష్యత్తులో వస్తాయని గ్యారెంటీ ఉండదు.

# అదిరిపోయే ఫీచర్లతో 2025 థార్



ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా సంస్థ ఎస్‌యూవీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'థార్ 2025' కొత్త మోడల్‌ను శుక్రవారం మార్కెట్లోకి విడుదల చేసింది. ఆకర్షణీయమైన డిజైన్, అత్యాధునిక ఫీచర్లతో వచ్చిన ఈ కొత్త థార్ ప్రారంభ ధరను రూ.9.99 లక్షలుగా (ఎక్స్-షోరూమ్) నిర్ణయించింది. పట్టణ ప్రయాణాలను మరింత సౌకర్యవంతంగా మార్చడంతో పాటు, వారాంతపు ఆఫ్-రోడ్ అడ్వెంచర్లను ఇష్టపడే వారిని లక్ష్యంగా చేసుకుని ఈ ఎస్‌యూవీని తీర్చిదిద్దినట్లు కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ కొత్త మోడల్‌లో టెక్నాలజీ, కంఫర్ట్‌కు పెద్దపీట వేశారు. ఇందులో 26.03 సెంటీమీటర్ల హెచ్‌డీ ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్‌ను అమర్చారు. ఇది ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్‌ప్లేలకు సపోర్ట్ చేస్తుంది. స్మార్ట్‌ఫోన్ కనెక్టివిటీ కోసం టైప్-సి యూఎస్‌బీ పోర్టులను కూడా అందించారు. ప్రయాణంలో టైర్ల దిశను తెలియజేసే టైర్ డైరెక్షన్ మానిటరింగ్ సిస్టమ్, అడ్వెంచర్ ప్రియుల కోసం రేసింగ్ ట్యాబ్, ఆల్టిమీటర్, ట్రిప్ మీటర్ వంటి వివరాలను అందించే 'అడ్వెంచర్ స్టాట్స్ జెన్ ××' ఫీచర్‌ను కూడా పొందుపరిచారు. ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈసారి అనేక మార్పులు చేశారు. ముఖ్యంగా వెనుక వరుసలో కూర్చునే వారి కోసం రియర్ ఏసీ వెంట్లను ఏర్పాటు చేశారు. డ్రైవర్ సౌకర్యం కోసం స్లైడింగ్ ఆర్మ్‌రెస్ట్, ఆటోమేటిక్ వేరియంట్లలో డెడ్ పెడల్ వంటివి ఇచ్చారు. డోర్-మౌంటెడ్ పవర్ విండోస్, రియర్-వ్యూ కెమెరా డ్రైవింగ్‌ను మరింత సులభతరం చేస్తాయి. ఈ సందర్భంగా మహీంద్రా అండ్ మహీంద్రా ఆటోమోటివ్ డివిజన్ సీఈఓ నళినీకాంత్ గొల్లగుంట మాట్లాడుతూ, "థార్ కేవలం ఒక ఎస్‌యూవీ మాత్రమే కాదు, ఇది స్వేచ్ఛకు, సాహసానికి ఒక ప్రతీక. వినియోగదారుల అభిప్రాయాలకు మేము ఎల్లప్పుడూ విలువ ఇస్తాం. వారి అవసరాలకు అనుగుణంగానే ఈ కొత్త థార్‌ను రూపొందించాం" అని తెలిపారు. కొత్త డిజైన్, స్మార్ట్ టెక్నాలజీ, మెరుగైన సౌకర్యాలతో ఈ మోడల్ పట్టణ, ఆఫ్-రోడ్ సెట్టింగ్‌లలో అద్భుతమైన డ్రైవింగ్ అనుభూతిని అందిస్తుందని ఆయన వివరించారు.

## ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు కెప్టెన్‌గా గిల్, టీ20లకు సూర్య సారథ్యం..

# వన్డేల్లోకి రోహిత్, కోహ్లీ

**ముంబై :** ఆస్ట్రేలియాతో జరిగే వన్డే, టీ20 సిరీస్‌లకు చెందిన భారతీయ జట్టును ప్రకటించారు. టీమిండియా వన్డే జట్టుకు శుభమన్ గిల్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టనున్నాడు. ఇక టీ20 సిరీస్ మ్యాచ్‌లకు సూర్యకుమార్ యాదవ్ సారధ్య బాధ్యతలను నిర్వర్తిస్తాడు. ఆస్ట్రేలియా, ఇండియా మధ్య మూడు వన్డేలు, అయిదు టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. అక్టోబర్-నవంబర్ నెలల్లో ఆ మ్యాచ్‌లు ఉంటాయి. సీనియర్స్ మెన్స్ సెలక్షన్ కమిటీ భారత బృందాన్ని ఎంపిక చేసింది. అయితే వన్డేల్లో సీనియర్ క్రికెటర్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీకి ఛాన్స్ దక్కింది. ఆ ఇద్దర్నీ ఆసీస్‌తో సిరీస్‌కు ఎంపిక చేశారు. ఇక వైస్ కెప్టెన్సీ బాధ్యతలను శ్రేయాస్ అయ్యర్‌కు అప్పగించారు. వన్డేలకు వికెట్ కీపర్‌గా కేఎల్ రాహుల్ ఎంపికయ్యాడు. వన్డే టీమ్‌లో నితీశ్, సుందర్, కుల్దీప్, హర్షిత్ రాణా, సిరాజ్, అర్షదీప్, ప్రసిద్ధ కృష్ణ, ధ్రువ్ జురెల్ , జైస్వాల్ కూడా ఉన్నారు. ఆసీస్‌తో జరిగే టీ20 సిరీస్‌కు సూర్యకుమార్ యాదవ్ సారధ్య బాధ్యతలు చేపట్టనున్నాడు. ఆ జట్టులో అభిషేక్ శర్మ, గిల్, తిలక్ వర్మ, నితీశ్, శివమ్ దూబే, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ, వరుణ్ చక్రవర్తి, బుమ్రా, అర్షదీప్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, సంజూ సాంసన్, రింకూ సింగ్, సుందర్ ఉన్నారు. అయితే వన్డే జట్టుకు స్పీడ్ బౌలర్ బుమ్రాను ఎంపిక చేయలేదు. తొలుత వన్డేలు జరుగుతాయి. అక్టోబర్




19వ తేదీన పెర్త్‌లో ఫస్ట్ వన్డే, అడిలైడ్‌లో 23న రెండో వన్డే, 25న సిడ్నీలో మూడో వన్డే ఆడనున్నారు. తొలి టీ20 అక్టోబర్ 29వ తేదీన కెనబెరాలో జరగనున్నది. మెల్‌బోర్న్‌లో రెండో టీ20 అక్టోబర్ 31వ తేదీన, మూడవ మ్యాచ్ నవంబర్ 2న హోబర్ట్‌లో, నాలుగో టీ20 గోల్డ్ కోస్టులో నవంబర్ 6న, 5వ టీ20 బ్రిస్బేన్‌లో నవంబర్ 8వ తేదీన ఆడుతారు.
కెప్టెన్సీ మార్పు గురించి రోహిత్ శర్మకు తెలియజేసినట్లు చీఫ్ సెలెక్టర్ అగార్కర్ తెలిపారు.

### ఫస్ట్ టెస్టులో విండీస్ విలవిల.. ఇన్నింగ్స్ 140 రన్స్ తేడాతో ఇండియా విక్టరీ

**అహ్మదాబాద్:** వెస్టిండీస్‌తో జరిగిన ఫస్ట్ టెస్టులో ఇండియా భారీ విజయాన్ని నమోదు చేసింది. అహ్మదాబాద్ టెస్టులో ఇన్నింగ్స్ 140 రన్స్ తేడాతో గిల్ సేన గెలుపొందింది. ఇవాళ రెండో ఇన్నింగ్స్‌లో విండీస్ కుప్పకూలింది. కేవలం 146 పరుగులకే ఆలౌటైంది. మూడో రోజు ఉదయం ఆట ప్రారంభానికి ముందే ఇండియా తన ఫస్ట్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేయడంతో.. వెస్టిండీస్ బ్యాటింగ్ ప్రారంభించింది. ఫస్ట్ సెషన్‌లోనే భోజన విరామ సమయానికి ముందు విండీస్ అయిదు వికెట్లను కోల్పోయింది. భారత స్పిన్నర్లు విండీస్ బ్యాటర్లకు దడపుట్టించింది. స్పిన్‌కు అనుకూలిస్తున్న అహ్మదాబాద్ పిచ్‌పై రెండో ఇన్నింగ్స్‌లో చెలరేగిపోయారు. విండీస్ బ్యాటర్లు చాలా ఈజీగా తమ వికెట్లను సమర్పించుకున్నారు. భారత బౌలర్లలో జడేజా 4, సిరాజ్ 3, కుల్దీప్ రెండు వికెట్లు తీసుకున్నారు. విండీస్ బ్యాటర్లలో అథనేజ్ 38, గ్రీవ్స్ 25 రన్స్ చేశారు.




## స్పోర్ట్స్

### పాపం అభిషేక్ శర్మ.. ఊహించని షాకిచ్చిన బీసీసీఐ!?



భారత వన్డే జట్టులోకి ఎంట్రీ ఇవ్వాలనుకున్న యువ సంచలనం అభిషేక్ శర్మకు నిరాశే ఎదురైంది. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు ఎంపిక చేసిన భారత జట్టులో అభిషేక్‌కు చోటు దక్కలేదు. రెగ్యూలర్ ఓపెనర్లగా శుబ్‌మన్ గిల్, రోహిత్ శర్మ ఉండగా.. బ్యాకప్ ఓపెనర్‌గా యశస్వి జైశ్వాల్‌ను సెలక్టర్లు ఎంపిక చేశారు. జైశ్వాల్ చివరగా ఈ ఏడాది ఫిబ్రవరిలో భారత తరపున వన్డేల్లో ఆడాడు. ఆ తర్వాత ఛాంపియన్స్ ట్రోఫీ-2025కి అతడిని పక్కన పెట్టారు. మళ్లీ ఇప్పుడు ఆసీస్‌తో సిరీస్‌కు ఈ ముంబై ఆటగాడికి సెలక్టర్లు తిరిగి పిలుపునిచ్చారు.

అభిషేక్ వెయిట్ చేయాల్సిందే..

అయితే అభిషేక్ శర్మ ప్రస్తుతం వైట్ బాల్ క్రికెట్‌లో దుమ్ములేపుతున్నాడు. ఇటీవల ముగిసిన ఆసియాకప్‌లో అభిషేక్ ప్లేయర్ ఆఫ్‌ది టోర్నమెంట్‌గా నిలిచాడు. ఈ టోర్నీలో పంజాబ్ ఆటగాడు 200 స్ట్రైక్ రేట్‌తో 314 పరుగులు చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. టీ20ల్లో ప్రపంచ నంబర్ వన్ బ్యాటర్‌గా అభిషేక్ కొనసాగుతున్నాడు. దీంతో ఆసీస్‌తో వన్డే సిరీస్‌కు అభిషేక్‌ను సెలక్టర్లు ఎంపిక చేస్తారని అంతా భావించారు. కానీ అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ అతడిని పరిగణలోకి తీసుకోలేదు. రోహిత్ శర్మ, గిల్, జైశ్వాల్ రూపంలో ఓపెనర్లు అందుబాటులో ఉండడంతో అభిషేక్ వైపు సెలక్టర్లు మొగ్గు చూపున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా 50 ఓవర్ల ఫార్మాట్‌లో శర్మ తన స్కిల్స్‌ను మరింత మెరుగుపరుచుకోవాలని సెలక్టర్లు సూచించినట్లు సమాచారం. అభిషేక్ శక్రవారం ఆసీస్-ఎతో జరిగిన అనాధికారిక వన్డేలో గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. ఇది కూడా అతడి ఎంపికపై ప్రభావం చూపించింది. అభిషేక్ శర్మ తన కెరీర్‌లో ఇప్పటివరకు 61 లిస్ట్-ఎ మ్యాచ్‌లు ఆడి 35.33 సగటుతో 2,014 పరుగులు చేశాడు. అతడి అత్యధిక వ్యక్తిగత స్కోర్ 170గా ఉంది. అదేవిధంగా బౌలింగ్‌లో కూడా 38 వికెట్లు పడగొట్టాడు. అయితే అభిషేక్ ఇదే ఫామ్‌ను కొనసాగిస్తే అత్యంత త్వరలోనే వన్డే జట్టులోకి కూడా వచ్చే అవకాశముంది. కాగా భారత వన్డే కెప్టెన్‌గా రోహిత్ శర్మను బీసీసీఐ తప్పించింది. అతడి స్థానంలో శుబ్‌మన్ గిల్‌కు వన్డే జట్టు పగ్గాలను అప్పగించారు.

## ఓటీటీలోకి రాబోతున్న ‘మిరాయ్’

టాలీవుడ్ యంగ్ హీరో తేజ సజ్జా నటించిన ‘మిరాయ్’ బాక్సాఫీసు వద్ద సంచనాలు సృష్టిస్తోంది. సెప్టెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు వచ్చి రికార్డులు క్రియేట్ చేస్తూ దూసుకుపోతుంది.అన్ని ప్రాంతాల్లో భారీ కలెక్షన్లు రాబడుతూ సినీ సెలబ్రిటీల ప్రశంసలు పొందుతోంది. ఇప్పటివరకు ఈ సినిమా ఏకంగా రూ. 150 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. కేవలం రూ. 60 కోట్ల బడ్జెట్‌తో విజువల్ వండర్‌గా వచ్చి ప్రేక్షకుల మనసులు గెలుచుకుంటోంది. దీంతో సినీ ప్రియులంతా ఈ చిత్రం ఎప్పుడెప్పుడు ఓటీటీలోకి వస్తుందా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ఈక్రమంలో.. తాజాగా, ‘మిరాయ్’ డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైనట్లు అధికారిక ప్రకటన విడుదలైంది. కేవలం నెలరోజులకే ఈ సినిమా ఓటీటీలోకి రాబోతుండటం విశేషం. ఈ చిత్రం హక్కులను ప్రముఖ సంస్థ జియో హాట్‌స్టార్ సొంతం చేసుకోగా.. అక్టోబర్ 10 నుంచి తెలుగు, తమిళ, మలయాళ కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ప్రకటించారు. “తొమ్మిది గ్రంథాలు. అనంతమైన శక్తి. బ్రహ్మాండాన్ని రక్షించడానికి ఒక సూపర్ యోధుడు. భారతదేశం సొంత సూపర్ హీరో మిరాయ్, అక్టోబర్ 10 నుండి మీ ఇంటి రాబోతున్నారు” అనే క్యాప్షన్ జత చేశారు. దీంతో ఈ విషయం తెలుసుకున్న ప్రేక్షకులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. కాగా.. తేజ సజ్జా, కార్తీక్ ఘట్టమనేని కాంబోలో వచ్చిన ఈ సినిమాను పీపుల్ మీడియా బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఇక ఇందులో రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇందులో మంచు మనోజ్ విలన్‌గా నటించగా.. జగపతిబాబు, శ్రియా శరణ్, జయరామ్ కీలక పాత్రలో కనిపించి నటనతో మెప్పించారు.



## ప్రభాస్‌లా నేను కూడా.. అందుకే అలా పిలుస్తారు



‘కేజీఎఫ్’ సినిమాతో హీరోయిన్‌గా పాన్ ఇండియా లెవల్లో గుర్తింపు తెచ్చుకున్న శ్రీనిధి శెట్టి.. తర్వాత అడపాదడపా దక్షిణాదిలో మూవీస్ చేస్తోంది. ఈ ఏడాది నాని ‘హిట్ 3’తో వచ్చింది. సక్సెస్ అందుకుంది. ఇప్పుడు ‘తెలుసు కదా’ అనే తెలుగు చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. అక్టోబరు 17న థియేటర్లలో రానున్న ఈ మూవీ ప్రమోషన్లలో మాట్లాడుతూ తనని ఫ్రెండ్స్ అందరూ లేడీ ప్రభాస్ అని పిలుస్తారని చెప్పింది. అందుకు గల కారణాన్ని కూడా బయటపెట్టింది. ‘నేను ప్రభాస్‌లా సోషల్ మీడియాలో ఎక్కువ ఉపయోగించను. అందుకే నా స్నేహితులందరూ నన్ను లేడీ ప్రభాస్ అని పిలుస్తుంటారు’ అని శ్రీనిధి శెట్టి చెప్పుకొచ్చింది. అయితే ఈ విషయమై ప్రభాస్ అభిమానులు భిన్నంగా స్పందిస్తుంటారు. తమ ఫేవరెట్ హీరోకి లేడీ వెర్షన్ అంటే అనుష్కనే అవుతుందని మాట్లాడుకుంటున్నారు. అయితే శ్రీనిధి శెట్టి కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. శ్రీనిధి కెరీర్ విషయానికొస్తే.. 2018 నుంచి ఇప్పటివరకు ఐదు సినిమాలు మాత్రమే చేసింది. కేజీఎఫ్ రెండు పార్ట్స్ హిట్ అయ్యాయి. తమిళంలో విక్రమ్ సరసన ‘కోబ్రా’ చేసింది. ఇది ఫ్లాప్ అయింది. తెలుగులో నానితో చేసిన ‘హిట్ 3’ ఆకట్టుకుంది. ఇప్పుడు సిద్ధు జొన్నలగడ్డ ‘తెలుసు కదా’లో ఓ హీరోయిన్‌గా చేసింది. ఈ మూవీ హిట్ అయితే ఈమెకు మరిన్ని అవకాశాలు వచ్చే ఛాన్సుంది. త్రివిక్రమ్–వెంకటేశ్ సినిమా కోసం ఈమెను హీరోయిన్‌గా తీసుకున్నారనే రూమర్ వినిపించింది. దీని గురించే ‘తెలుసు కదా’ ప్రమోషన్లలో అడగ్గా.. ఈ ప్రాజెక్ట్ విషయంలో తనని ఎవరు సంప్రదించలేదని క్లారిటీ ఇచ్చింది.

## మళ్లీ ‘సీరియస్’ గా శ్రీ విష్ణు




యువ కథానాయకుడు శ్రీ విష్ణు కెరీర్ ఆరంభంలో ఎక్కువగా సీరియస్ సినిమాలే చేసేవాడు. కొంచెం ముభావంగా, సీరియస్‌గా కనిపించే అతడికి ఆ తరహా పాత్రలే సూటవుతాయి అనిపించేది. అప్పట్లో ఒకడుండేవాడు, నీదీ నాది ఒకే కథ లాంటి చిత్రాల్లో సీరియస్ పాత్రలు చేసి మెప్పించాడు శ్రీ విష్ణు. ఐతే తర్వాత తన ఇమేజ్ మారిపోయింది. బ్రోచేవారెవరురా, సామజవరగమన, శ్వాగ్, సింగిల్ లాంటి కామెడీ చిత్రాలతో అతను ప్రేక్షకులను ఇంప్రెస్ చేశాడు. వీటి కంటే ముందు అతను చేసిన సీరియస్ సినిమాలన్నీ తేడా కొట్టాయి. అర్జున ఫల్గుణ, అల్లూరి లంటి సినిమాల తర్వాత ఇక సీరియస్ సినిమాలు చేస్తే వర్కవుట్ కావేమో అన్నట్లుగా వరుసగా ఎంటర్టైనర్లే చేశాడు శ్రీ విష్ణు. ఐతే ఇప్పుడు ఈ యంగ్ హీరో మళ్లీ ‘సీరియస్’ బాట పడుతున్నాడు. ‘కామ్రేడ్ కళ్యాణ్’ పేరుతో శ్రీ విష్ణు కొత్త సినిమాను అనౌన్స్ చేశాడు. జానకిరామ్ అనే కొత్త దర్శకుడు ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాడు. నిర్మాణ సంస్థ కూడా కొత్తదే. కోన వెంకట్ సమర్పణలో వెంకటకృష్ణ, సీత అనే డెబ్యూ ప్రొడ్యూసర్లు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో శ్రీ విష్ణు నక్సలైట్ పాత్ర చేస్తున్నాడు. 1992లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని మాడుగుల అనే ప్రాంతంలో జరిగే కథ ఇది. ఇందులో శ్రీ విష్ణు ద్విపాత్రాభినయం కూడా చేస్తున్నాడట. ఐతే నక్సలైట్ కథలకు ఈ మధ్య గిరాకి బాగా తగ్గిపోయింది. వాటిని ఎంత బాగా తీసినా.. ఇప్పటి ప్రేక్షకులకు పెద్దగా ఎక్కట్లేదు. ‘విరాటపర్వం’ లాంటి మంచి సినిమాకు ఎలాంటి ఫలితం దక్కిందో తెలిసిందే.

## ధనుష్ అదిరిపోయే ప్లాన్.. అప్పుడే మరో సినిమా రిలీజ్..!



యాక్టర్ కమ్ డైరెక్టర్‌గా ఇండస్ట్రీలో ఫుల్ బిజీగా ఉన్న సెలబ్రిటీల్లో ఒకరు ధనుష్. ఇటీవలే ఇడ్లీ కడై సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. ఫ్యామిలీ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ మూవీ తమిళనాడులో మంచి టాక్‌తో స్ర్కీనింగ్ అవుతోంది. కాగా ధనుష్ నటిస్తోన్న హిందీ ప్రాజెక్ట్ తేరే ఇష్క్ మే నవంబర్‌లో విడుదల కానుంది. ఆనంద్ ఎల్ రాయ్, ధనుష్ కాంబోలో మూడోసారి వస్తోన్న ఈ చిత్రంలో కృతిసనన్ హీరోయిన్‌గా నటిస్తోంది. కాగా ఈ సినిమా విడుదల కాకముందే మరో చిత్రానికి సంబంధించిన ఆసక్తికర వార్త నెట్టింట వైరల్ అవుతోంది. %ూశీతీ ుష్త్రశీఓష్త్రఅశ్రీ% ఫేం విఘ్నేష్ రాజా దర్శకత్వం వహిస్తున్న చిత్రం ధనుష్ 54. వేల్స్ ఫిల్మ్ ఇంటర్‌నేషనల్ బ్యానర్‌పై ఇషారి గణేష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వీ ప్రకాశ్ సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమా షూటింగ్ కూడా ఇప్పటికే పూర్తి చేశాడట ధనుష్. అంతేకాదు ఈ మూవీని 2026 ఫిబ్రవరిలో అభిమానుల ముందుకు తీసుకొచ్చేలా ప్లాన్ చేస్తున్నాడన్న వార్త ఇప్పుడు ఇండస్ట్రీ సర్కిల్‌లో హల్ చల్ చేస్తోంది. ఇదే నిజమైతే ధనుష్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో అభిమానులకు ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ అందించనుండటం పక్కా అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. సినిమాలు చేసే విషయంలో ధనుష్ స్పీడును చూసిన అభిమానులు షాకవుతున్నారు.



## జాన్వీ కపూర్ ఇక జాగ్రత్త పడాల్సిందే

ఒకపక్క టాలీవుడ్ లో జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్ లాంటి అగ్ర హీరోల సరసన ఆఫర్లు పడుతున్న బాలీవుడ్ హీరోయిన్ జాన్వీ కపూర్ అటు హిందీలో టయర్ 2 స్టార్లతో జట్టు కడుతూ వరస ఫ్లాపులు మూటగట్టుకుంటోంది. పెర్ఫార్మన్స్ పరంగా తన వంతు లోపం ఏమీ లేకపోయినా సబ్జెక్టు సెలక్షన్ లో చేస్తున్న తప్పుల వల్ల గుర్తుండిపోయే సినిమాలు రావడం లేదు. ఆ మధ్య పరం సుందరి ఏం చేసిందో చూశాం. తాజాగా సన్నీ సంస్కారికి తులసి కుమారితో నిన్న థియేటర్లలో అడుగు పెట్టింది. రెండు పాటలు, కాసింత కామెడీ తప్ప మిగిలినదంతా రొట్ట రొటీన్ వ్యవహారమంటూ క్రిటిక్స్ ఈ మూవీ గురించి గట్టిగా తలంటేశారు.వరుణ్ ధావన్ హీరోగా నటించిన సన్నీ సంస్కారికి తులసి కుమారిలో ఎంటర్ టైన్మెంట్ ని ప్రధానంగా టార్గెట్ చేసుకున్నారు కానీ అది ఎంత రెగ్యులర్ గా వెళ్తోందో దర్శకుడు శశాంక్ కేతన్ గుర్తించకలేకపోయాడు. కథగా చూసుకుంటే సన్నీ (వరుణ్ ధావన్) అనే కుర్రాడికి ప్రాణంగా ప్రేమించిన గర్ల్ ఫ్రెండ్ (సన్యా మల్హోత్రా) హ్యాండ్ ఇచ్చి బాగా డబ్బున్న వాడిని పెళ్లి చేసుకోవడానికి నిర్ణయించుకుంటుంది. దీంతో ఒళ్ళు మండిన సన్నీ ఆ పెళ్లి కొడుకు ఇష్టపడిన తులసి (జాన్వీ కపూర్) అనే అమ్మాయితో చేతులు కలుపుతాడు. కొత్త జంటకు బుద్ధి చెప్పాలని డిసైడై ఒక ప్లాన్ వేసుకుంటారు. దాన్ని తెరమీదే చూసి తరించాలి. అవుట్ డేటెడ్ ట్రీట్ మెంట్ తో సన్నీ సంస్కారికి తులసి కుమారి అధిక శాతం విసుగు తెప్పిస్తుంది. ప్రతి సన్నివేశం ఈజీగా ముందే ఊహించేలా స్క్రీన్ ప్లే సాగడం ప్రధానమైన మైనస్. జాన్వీ, సాన్య పోటీపడి నటించినప్పటికీ పాత చింతకాయ పచ్చడి స్టోరీలో అవి కొట్టుకుపోయాయి.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.